
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

గురువారం 11 సెప్టెంబరు 2025

మైలవరానికి నీరు నిలుపుదల

కొండాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి బుధవారం రాత్రి నుంచి నీరు నిలుపుదల చేశామని ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 7,100 క్యూసెక్కులు ఉందన్నారు. జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 6,500 క్యూసెక్కులు ఉందన్నారు. కాగా సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 24.682 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ తెలిపారు

ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీల నియామకం



నాగరాజు, ఝాన్సీరాణి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలుగా ఇద్దరిని నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి జిల్లాలో స్కూల్ గేమ్స్ సెక్రటరీగా ఒకరినే నియమించే సంస్కృతి వీడి ఈసారి ఒక మగ, ఒక మహిళా సెక్రటరీని నియమిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు మదనపల్లె మండలం సీటీఎం జడ్పీ హైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వై.నాగరాజు, కలకడ మండలం కోన జడ్పీ హైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎ.ఝాన్సీరాణిని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలుగా నియమించారు. క్రీడల్లో బాలురతో పాటు, బాలికలు కూడా సరిసమానంగా పాల్గొంటున్న తరుణంలో బాలికల సమస్యలు, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై శ్రద్ధ పెట్టడానికి మహిళా సెక్రటరీని నియమించినట్లు తెలుస్తోంది. వీరిద్దరు జిల్లాలో అండర్ 14, 17, 19 (ఇంటర్మీడియట్) విద్యార్థులతో మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడలు నిర్వహించడంతో పాటు, క్రీడాభివృద్ధికి కృషి చేయాల్సి ఉంది.

విద్యార్థుల ప్రతిభకు వేదిక కళా ఉత్సవ్

- నేడు, రేపు డైట్‌లో జిల్లా స్థాయి పోటీలు
- 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు అర్హులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కళా ఉత్సవ్ పేరుతో ప్రభుత్వం ఈనెల 11, 12 తేదీల్లో రాయచోటిలోని డైట్ కేంద్రంలో జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తోంది. గురువారం ఉదయం 9 గంటల నుంచి పోటీలు జరగనున్నాయి. జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్న వారు అక్టోబరు 24, 25వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి పొందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో పాల్గొంటారు.

పోటీలకు అర్హులు వీరే

కళా ఉత్సవ్ పోటీల్లో ఉమ్మడి కడప జిల్లాలోని 51 మండలాలకు చెందిన అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు మాత్రమే అర్హులని విద్యా శాఖాధికారులు తెలిపారు. అలాగే పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు తప్పనిసరిగా అపార్ ఐడీ కలిగి ఉండాలన్నారు. 2023లో గానీ, 2024లో గానీ జాతీయ కళా ఉత్సవ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులు అదే కళారూపంలో 2025 పోటీల్లో పాల్గొనకూడదన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను పోటీలకు పంపే ముందు వారి తల్లిదండ్రుల నుంచి ముందస్తుగా అనుమతి తప్పనిసరిగా పొందాలని తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని సెల్ టవర్ ఎక్కిన భర్త

- అత్త హామీతో టవర్ దిగిన అల్లుడు

6

లెక్కలు.. ఇక పక్కా...

- ఎంబీకే యాప్‌తో గ్రామ సమాఖ్యలకు ప్రత్యేక గుర్తింపు
- త్వరలో డిజిటల్ చెల్లింపులు
- దేశంలోనే తొలిసారి ఏపీలో
- పైలట్ ప్రాజెక్టుగా రామసముద్రం
- ఈనెల 15 నుంచి అమలు



రామసముద్రం మండలంలో వీవో సమావేశంలో సభ్యురాలి ముఖచిత్రం తీస్తున్న సంఘమిత్ర (ఫైల్)

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 1056 గ్రామ సమాఖ్యలు.. 2.56 లక్షల మంది మహిళా సభ్యులు... రూ.1323 కోట్ల లావాదేవీలు వెరసి జిల్లా బడ్జెట్ కంటే ఎక్కువ రుణాలు, చెల్లింపులు జరిగే వెలుగు మహిళా సంఘాల్లో అక్రమాలు కోకొల్లలు. అక్షరాస్యత లేని వేలాది మంది మహిళలు గ్రూపు లీడర్లు, సంఘమిత్రలు చెప్పిందే వేదంగా నడుచుకుంటూ మోసపోతున్నారు. ఇలాంటి మోసాలు, అక్రమాలను అరికట్టడానికి కూటమి ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రతి సంఘ సభ్యురాలికి ఒక ఐడీ (ప్రత్యేక గుర్తింపు) తీసుకొస్తోంది. అంతే కాదండోయ్.. గ్రూపు సభ్యులు బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్మును గ్రూపు లీడర్లకు కాకుండా నేరుగా డిజిటల్ విధానంలో తమ ఖాతాలో బ్యాంకులకే చెల్లించవచ్చు. మొత్తం మీద ఒక క్లిక్ చేస్తే చాలు జిల్లాలోని 2.56 లక్షల మంది మహిళా సభ్యుల వివరాలు స్ర్కీన్ మీద చూసుకునే వెసులుబాటును సెర్ప్ కల్పించనుంది. దేశంలోనే ఏ రాష్ట్రంలో కూడా లేనటువంటి ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. డిసెంబరు 15వ తేదీ నాటికి రాష్ట్రంలోని 90 లక్షల మంది మహిళా సంఘాల సభ్యురాళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో ఎక్కనున్నాయి.

అక్రమాలకు అడ్డుకట్ట ఎంబీకే యాప్

జిల్లాలో 1,056 గ్రామ సమాఖ్యలకు గాను 2.56 లక్షల మంది మహిళా సభ్యులు ఉన్నారు. వీరంతా కలిసి ఏడాదికి రూ.1200 కోట్ల ఆర్థిక లావాదేవీలు చేపట్టాలని లక్ష్యంగా డీఆర్‌డీఏ అధికారులు పనిచేస్తున్నారు. కాకుంటే ఈ ఏడాది ఆగస్టు చివరికే ఈ లక్ష్యం దాటి రూ.1320 కోట్లు మహిళా సంఘాలు ఆర్థిక లావాదేవీలు నిర్వహించారు. ముఖ్యంగా బ్యాంకు రుణాలు, పొదుపు, స్త్రీ నిధి, ఉన్నతి తదితర పథకాల ద్వారా మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేస్తూ, తిరిగి వాటి చెల్లింపులను మొబైల్ బుక్ కీపర్లు చేస్తుండేవారు. గ్రామాల్లో ఒక గ్రామ సమాఖ్యకు ఒక సంఘమిత్ర, ప్రతి పది మందితో ఏర్పడిన సంఘానికి ఒక లీడర్ ఉన్నారు. ఈ ఆర్థిక లావాదేవీలు అన్నీ గ్రూపు లీడర్లు, సంఘమిత్రల పర్యవేక్షణలో జరిగేవంటే అతిశయోక్తి కాదు. కాగా ఈ ఆర్థిక లావాదేవీల్లో జిల్లాలోని పలు గ్రామాల్లో సంఘాలు, సంఘమిత్రలు అవకతవకలకు పాల్పడిన సంఘటనలు కోకొల్లలు. ఈ అక్రమాలు బయటపడ్డాక, విచారణ కమిటీలు అక్రమార్కుల నుంచి రికవరీలు ఒక ప్రహసనంగా మారేవి. వీటన్నింటికి చెక్ పెట్టడంతో పాటు మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతకు కూటమి ప్రభుత్వం వినూత్న విధానం తీసుకొచ్చింది.

మన డబ్బులు..మన లెక్కలు

మహిళా సంఘాల్లోని ప్రతి సభ్యురాలి మొబైల్‌లో మన డబ్బులు..మన లెక్కలు (ఎండీ..ఎంఎల్) యాప్ డౌన్‌లోడ్ చేయిస్తారు. ప్రతి గ్రామంలో ఒక మహిళను ఏర్పాటు చేసి వారి ద్వారా సభ్యురాళ్ల మొబైల్‌లో ఎండీ..ఎంఎల్ యాప్ ఇన్‌స్టాల్ చేయిస్తారు. ఈ యాప్‌ల నిర్వహణపై ఇప్పటికే ఏపీఎంలను రిసోర్సు పర్సన్‌లుగా, సంఘమిత్రలకు శిక్షణ ఇచ్చారు. ఎండీ..ఎంఎల్ యాప్ ద్వారా ప్రతి సభ్యురాలికి ప్రత్యేక ఐడీ కేటాయిస్తారు. ఈ ఐడీ నెంబర్ కొడితే చాలు ఆన్‌లైన్‌లో ఆ సభ్యురాలి లావాదేవీలు, డీఫాల్ట్ వివరాలు టక్కున కనిపిస్తాయి. గ్రామాల్లో చాలామంది నిరక్షరాస్యులైన మహిళలు ఉండటం వలన వారి మొబైల్‌లో ఆన్‌లైన్ వివరాలు చదువుకోలేకపోతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా వారి మొబైల్‌లో వివరాలన్నీ ఆడియో రూపంలో సందేశాలు వస్తాయి. దీనివలన ఎక్కడా మోసాలు, అక్రమాలు జరగకుండా సంఘాల సభ్యురాళ్లు జాగ్రత్త పడొచ్చు. అంతేకాకుండా ఈ యాప్ ద్వారా ఎక్కడైనా అక్రమాలు జరిగితే ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసుకోవచ్చు. జిల్లాలో రామసముద్రం మండలంలోని ఐదు గ్రామ సమాఖ్యలను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. ఈనెల 15 నుంచి ఈ పద్ధతి అమలు చేయనున్నారు.

మన డబ్బు..మన లెక్కలు మొబైల్ యాప్ లోగో

త్వరలో డిజిటల్ విధానంలో చెల్లింపులు

మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి, పొదుపు చెల్లింపులు ఇది వరకు నగదు రూపంలోనే బ్యాంకులో చెల్లించేవారు. దీని వలన సమయం వృథాతో పాటు అక్రమాలకు చోటుండేది. ఇక మీదట వీటన్నింటికి చెల్లింపులు డిజిటల్ విధానంలో చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే స్త్రీ నిధి నగదు చెల్లింపులకు పీటీఎం మిషన్‌లు అందుబాటులో తీసుకురావడమే కాక, ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తోంది.

మొబైల్ బుక్ కీపర్ 2.0 యాప్

మొబైల్ బుక్ కీపర్ ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, హాజరైన సభ్యుల వివరాలు, అప్పులు, పొదుపులు, వడ్డీలు నమోదు చేసేవారు. అప్పట్లో 50 శాతం మంది మాత్రమే సభ్యురాళ్లు, సంఘమిత్రలు సమావేశాలకు హాజరయ్యే వారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మొబైల్ బుక్ కీపర్ 2.0 యాప్ ద్వారా అన్నీ పారదర్శకంగా జరగనున్నాయి. ఎంబీకే 2.0 యాప్ ద్వారా ప్రతి సంఘంలోని సభ్యురాలి బయోమెట్రిక్, జియో ట్యాగింగ్, ఫేషియల్ రికగ్నైజేషన్ పద్ధతితో 3 ముఖ చిత్రాలు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతి వీవో మీటింగ్, సంఘం మీటింగ్ ఏ ప్రాంతంలో నిర్వహిస్తారో జియోట్యాగింగ్ చేస్తారు. ప్రతి నెలా జరిగే సమావేశానికి ఏ ఒక్క సభ్యురాలు హాజరు కాకపోయినా, ఈ యాప్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదికలు వెళ్లిపోతాయి. దీనివలన హాజరుకాని సభ్యురాలి పేరిట మంజూరయ్యే రుణాలు వేరే వాళ్లెవరూ తీసుకునే ఆస్కారం ఉండదు. వరుసగా మూడు సమావేశాలకు హాజరు కాని సభ్యురాలిని డీఫాల్ట్ కింద పెట్టేస్తారు. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవీ వర్తించకుండా చేస్తారు. దీని వలన జిల్లాలోని 2.56 లక్షల మంది సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.



ఎంబీకే 2.0 మొబైల్ యాప్

జిల్లాకు స్వచ్ఛాంధ్ర అవార్డులు తీసుకురండి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రతకు అగ్రస్థానం ఇస్తున్న నేపథ్యంలో జిల్లాకు స్వచ్ఛాంధ్ర అవార్డులు తీసుకురావాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. అవార్డులకు లక్ష్యంగా విధించిన మొత్తం 13 కేటగిరీల్లో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు బజార్లు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో రాష్ట్ర స్థాయి బృందాలు వివిధ పారామీటర్ల మేరకు పరిశీలిస్తుందని, అధికారులు సిద్ధం కావాలన్నారు. నియోజకవర్గ స్పెషల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి స్వచ్ఛ అన్నమయ్య జిల్లాకు శ్రీకారం చుట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మిషన్ శక్తి పథకంతో మహిళలకు భద్రత

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, సాధికారితను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రారంభించిందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పథకంలో భాగంగా సంకల్ప కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్‌లోని వీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణ కోసం ప్రభుత్వం వివిధ రకాల పథకాలను, చట్టాలను, ఏర్పాటు చేసిందని, వీటన్నింటిపై అవగాహన, సద్వినియోగం చేసుకోవడం కోసం మిషన్ శక్తి పథకంలో భాగంగా సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో బేటీ బచావో, బేటీ పఢావో, మహిళల భద్రత, చట్టపరమైన అవగాహన, ఉన్నత విద్య, వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, మహిళల కౌమార బాలికల ఆరోగ్యం, పోషకాహారం, సమాజంలో జరిగే క్రైమ్‌లు తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే సమాజంలో మన చుట్టూ మహిళలపై జరిగే అక్రమాలను ప్రశ్నించే విధంగా మహిళలు ముందుకు రావాలని కోరారు. సీడీపీవోలు, ఆశావర్కర్లు, అంగన్వాడీలు ముందుగా పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, సీడీపీవోలు, ఆశావర్కర్లు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

కన్యాకుమారి రైలుకు పూజలు



కొండాపురం రైల్వేస్టేషన్‌లో కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలుకు పూజలు నిర్వహించి స్వాగతం పలుకుతున్న స్థానికులు

కొండాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్థానికులు బుధవారం కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు (జయంతి ఎక్స్‌ప్రెస్)కు పూజలు నిర్వహించారు. కరోనా తర్వాత కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఈ రైలుకు స్టాపింగ్ ఎత్తివేశారు. తిరిగి బుధవారం నుంచి పునరుద్ధరించడంతో ఉదయం 7.30 గంటల ప్రాంతంలో రైలు స్టేషన్‌లోకి రాగానే స్థానికులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని ఘనంగా స్వాగతం పలికారు. మామిడి ఆకులు, పూలదండలతో రైలుకు తోరణాలు కట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బ్రిటీష్‌కాలం నుంచి కొండాపురం రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. పక్కనే చిత్రావతి, పెన్నా నదులతో పాటు గండికోట బ్యాక్‌వాటర్ ఉండటం వల్ల స్టేషన్ మీదుగా వెళ్లే దాదాపు 80 శాతం రైళ్లు నీళ్ల కోసం ఇక్కడ ఆగేవని అన్నారు. కరోనా తర్వాత ఒక ఇంటర్‌సిటీ ప్యాసింజర్ తప్ప అన్ని రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేశారన్నారు. ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు రైల్వేశాఖపై ఒత్తిడి తేవడం వల్ల మూడు రైళ్లకు స్టాపింగ్ ఇచ్చారన్నారు. ఈ రైళ్లతో పాటు కొండాపురం రైల్వేస్టేషన్‌లో అన్ని రైళ్లకు స్టాపింగ్ పునరుద్ధరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీరామ్ బాబురెడ్డి, మనోహర్‌బాబు, ప్రజాసంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

2600 టన్నుల ఎరువులు రాక



ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్

కడప రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వ్యవసాయ అవసరాలకు గాను బుధవారం కడప రైల్వేస్టేషన్‌కు రేక్ ద్వారా కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు 2600 టన్నుల యూరియా ఎరువులు వచ్చాయి. డీఏవోలు, కంపెనీ ప్రతినిధులు రేక్ అధికారులతో సంప్రదించి కేటాయించిన పరిణామాలను ఆయా జిల్లాలకు సరఫరా చేశారు. ఇందులో కడప జిల్లాకు 800 టన్నులు రాగా వాటిలో 290 టన్నులు ప్రైవేట్ డీలర్లకు, 510 టన్నులు మార్క్‌ఫెడ్‌కు తరలించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 500 టన్నులు రాగా వాటిలో ప్రైవేట్ డీలర్లకు 100 టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 400 టన్నులు పంపిణీ చేశారు. అలాగే అనంతపురం జిల్లాకు 800 టన్నులు రాగా వాటిలో ప్రైవేట్ డీలర్లకు 240 టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 560 టన్నులు కేటాయించారు. సత్యసాయి జిల్లాకు 500 టన్నులు రాగా వాటిలో ప్రైవేట్ డీలర్లకు 150 టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 350 మెట్రిక్ టన్నులు ఇచ్చారు.

పోలీస్ శాఖకు నూతన జాగిలం



జాగిలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప (క్రైం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేసుల ఛేదనలో నేరస్థులను గుర్తించేందుకు వీలుగా పోలీసు శాఖకు నూతన జాగిలం వచ్చింది. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ నూతన జాగిలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సోను అనే జాగిలం మలనాయిస్ జాతికి చెందినదని, మంగళగిరి హెడ్ క్వార్టర్స్ కెనైన్ ట్రైనింగ్ సెంటర్‌లో 10 నెలల పాటు పేలుడు, ట్రాకింగ్ అంశాల్లో శిక్షణ పొందిందని తెలిపారు. అనంతరం డాగ్‌స్క్వాడ్‌కు సూచనలు చేశారు. ఈ కార్యక్రంలో ఆర్ఐ శివరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

28 సబ్‌స్టేషన్‌ల కోసం ప్రతిపాదనలు

- ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ గురవయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ గురవయ్య

పీలేరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ పరిధిలో లోవోల్టేజ్ సమస్య అధిగమించేందుకు 28 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఏపీ ట్రాన్స్‌కో మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్స్ డైరెక్టర్ కె.గురవయ్య తెలిపారు. పీలేరులోని ఈఈ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షించిన ఆయన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ తన పరిధిలోని తొమ్మిది జిల్లాల్లోనూ కొత్తగా 50 సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇవే కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి అదనంగా మరో 28 వాటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.4 కోట్లు వెచ్చిస్తోందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం వ్యవసాయ సర్వీసుల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ, గృహావసరాలకు నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు వినియోగించాలని, తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ప్రజలకు సూచించారు. సకాలంలో విద్యుత్ చార్జీలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన పీలేరు ఈఈ కార్యాలయ పరిధిలోని వివిధ సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో రాయచోటి ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి, పీలేరు ఈఈ చంద్రశేఖర రెడ్డి, ఎంఅండ్‌పీ సీఎం విజయభాస్కర, పీలేరు డివిజన్ పరిధిలోని ఏడీఈలు అమీర్ బాషా, శివయ్య, జ్ఞానేశ్వర్, లక్ష్మీపతి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బ్రహ్మయ్య ఆచారి, పీలేరు డివిజన్‌లోని ఏఈలు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రుల రాక

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు గురువారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వస్తున్నారని మంత్రి కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన వెలువడింది. మంత్రులిద్దరూ గురువారం ఉదయం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం రాయచోటి మాసాపేటలోని మార్కెట్ యార్డులో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీల నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రైతులకు సరిపడేలా యూరియా

- పంపిణీని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ కళ్యాణి



యూరియా పంపిణీపై ఏవోకు సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ కళ్యాణి

రామసముద్రం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడేలా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. మండలంలోని మినికి గ్రామంలో యూరియా నిల్వలు, యూరియా పంపిణీని సబ్‌కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులకు యూరియా పంపిణీ చేసిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు పండించే ప్రతి ఎకరాకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు యూరియా అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అలాగే యూరియాను పంటలకు అనువుగా తగు మోతాదులో వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఉపయోగించాలని రైతులకు సూచించారు. అనంతరం మండల వ్యవసాయాధికారికి, ఇతర సిబ్బందికి యూరియా పంపిణీపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్, ఆర్ఐ వసీం, వ్యవసాయాధికారి జాఫర్, రెవెన్యూ సిబ్బంది రెహ్మాన్, జగదీశ్, రామ్‌మోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల బారి నుంచి లేగ దూడలను కాపాడుకోవాలి

● జిల్లా పశుసంవర్థక అధికారి గుణశేఖరపిళ్లై



రైతులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా పశుసంవర్థక అధికారి

పీలేరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నేటి దూడలే రేపటి పాడి ఆవులు అని, వాటిని చిన్నతనం నుంచే వ్యాధుల బారి నుంచి సంరక్షించుకోవాలని జిల్లా పశు సంవర్థక అధికారి గుణశేఖర పిళ్లై పాడి రైతులకు పిలుపునిచ్చారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ రామిరెడ్డిగారి పల్లెలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు తల్లి దగ్గర ముర్రుపాలు పట్టినట్లే, పుట్టిన అరగంటలోపు ఆవు దగ్గర లేగ దూడకు ముర్రుపాలు తాగించాలన్నారు. తద్వారా అది నిరోధక శక్తి సాధిస్తుందన్నారు. అనంతరం దూడల పెంపకంలో పాటించాల్సిన మెళకువలు, వాడాల్సిన దాణా, నట్టల నివారణ మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రదర్శనకు హాజరైన దూడల్లో ఆరోగ్యంగా ఉన్న మూడు వాటికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ డీడీ మాలకొండయ్య, పశువైద్యాధికారులు ప్రదీప్, రామచంద్రారెడ్డి, మునిచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

వాల్మీకిపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. అయ్యవారిపల్లెలో బుధవారం ఆయన పర్యటించి ప్రకృతి వ్యవసాయంలో రైతులు సాగు చేసిన 365 రోజుల కూరగాయల పంటలు, 32 రకాల విత్తనాలతో వేసిన పీడీఎంఎస్, వరి, తదితర పంటల సాగును పరిశీలించారు. ఈ మోడల్ ద్వారా వచ్చిన ఆదాయం, పెట్టుబడి తదితర విషయాలపై స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ నాగప్రసాద్, మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఏపీఎంఐ జిల్లా పీడీ లక్ష్మీప్రసన్న, కేవీకే శాస్త్రవేత్తలు పీరుసాహెబ్, సోమశేఖర్, ఆత్మ బీటీఎం అమరనాథ్, పవన్, ప్రకృతి వ్యవసాయ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొడవలితో దాడి- ముగ్గురికి గాయాలు



గాయపడ్డ ప్రవీణ్

కలకడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూతగదా విషయమై కొడవలితో దాడి చేసిన ఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన ముడియంవారిపల్లి కొత్తపల్లిలో చోటు చేసుకుంది. సీఐ లక్ష్మన్న వివరాల మేరకు.. ప్రవీణ్‌తో అదే గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి దారి విషయంగా భూమి వద్ద గొడవ పడ్డట్లు తెలిపారు. పరిస్థితి సద్దుమణి గాక తిరిగి ప్రవీణ్ ఇంటి వద్దకు వెళ్లిన ప్రసాద్‌రెడ్డి, అతని అనుచరులు ప్రవీణ్‌పై కొడవలితో దాడి చేసి అడ్డువచ్చిన తండ్రి వెంకటరమణ, తల్లి సుబ్బమ్మను గాయ పరచినట్లు చెప్పారు. బాధితులను చికిత్స కోసం 108లో వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని..

సెల్ టవర్ ఎక్కిన భర్త


● విలపించిన తల్లిదండ్రులు, బంధువులు

● అత్త హామీతో టవర్ దిగిన అల్లుడు



గుమికూడిన జనంతో పాటు తల్లి పెంచలమ్మ, (ఇన్‌సెట్లో) పోలీసులకు వివరిస్తున్న కళ్యాణ్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో భర్త సెల్ టవర్ ఎక్కిన సంఘటన బుధవారం రైల్వేకోడూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని ధర్మాపురానికి చెందిన వెంబడి కళ్యాణ్ రంగ నాయకులపేటకు చెందిన లత అనే వంహిళను ప్రేమించి పదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలం కాపురం సాఫీగానే సాగినా.. అనంతరం తరచూ కుటుంబ కలహాలతో భార్యభర్తల మధ్య గొడవలు నెలకొన్నాయని పలువురు చెబుతున్నారు. ఇదివరకే రెండుసార్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లత భర్తపై ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 12.50 గంటలకు రైల్వేకోడూరు ఎక్సైజ్ స్టేషన్ పక్కనే ఉన్న సెల్ టవర్‌ను కళ్యాణ్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపకశాఖల అధికారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు తదితరులు సెల్‌టవర్ దగ్గరకు చేరుకున్నారు. కిందకు దిగమని ఎంత చెప్పినా వినలేదు. ముందు జాగ్రత్తగా అగ్నిమాపక శాఖ అధికారి విజయకుమార్ వల తెప్పించి సిద్ధం చేశారు. కాగా ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌లు ప్రత్యేక చర్యలు తీసుకుని కళ్యాణ్ అత్తను సెల్ టవర్ వద్దకు తీసుకొచ్చి భార్య లతతో మాట్లాడిస్తామని చెప్పించారు. దీంతో టవర్‌పై ఉన్న కళ్యాణ్ దిగిరావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఇతని భార్య ప్రస్తుతం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉంది. ఆమెను పిలిపించి కాపురం చేయించే విధంగా పోలీసులు, బంధువులు, కుటుంబ సభ్యులు యత్నిస్తున్నారు.



సెల్ టవర్ ఎక్కిన కళ్యాణ్

13న జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న రైల్వేకోడూరు ప్రభుత్వ హైస్కూలు మైదానంలో జిల్లా స్థాయి 51వ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు హరినాథ, పి.అరుణలు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికలు పూర్తయిన తర్వాత జిల్లా స్థాయి టీంను ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో విజయవాడలోని గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 51వ అంతర్ జిల్లాల పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపిక పోటీలకు డిసెంబరు 31, 2006 లోపు పుట్టిన వారై ఉండాలని, బాలురు బరువు 75 కిలోలు, బాలికలు 65 కిలోలు ఉండాలన్నారు. వివరాలకు సెల్ నెంబరు 9392951505, 8639020050ను సంప్రదించాలన్నారు.

నకిలీ బంగారం కేసును ఛేదించిన పోలీసులు

● ఇద్దరు అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత నెలలో రెండు వేర్వేరు చోట్ల నకిలీ బంగారం కుదవ పెట్టి కొందరు నగదుతో ఉడాయించిన విషయం తెలిసిందే. అయితే అందులో ఓ కేసును పోలీసులు ఛేదించి బుధవారం నిందితులను పట్టుకున్నారు. ఎస్ఐ వీఎల్ ప్రసాద్ రెడ్డి కథనం మేరకు... పట్టణంలోని బలిజ వీధికి చెందిన ఎలిశెట్టి వెంకటేష్ బంగారు కుదవ దుకాణం నడుపుతున్నాడు. ఈ దుకాణానికి గత నెల 20న కలికిరి నియోజకవర్గంలోని కలకడ మండలానికి చెందిన రవికుమార్, సోనియాగాంధీ అనే ఇద్దరు వచ్చి నకిలీ బంగారం (బ్రాస్‌లేట్)ను రూ.1,60,000లకు కుదవ పెట్టి డబ్బుతో ఉడాయించారు. కాగా ఇది నకిలీ బంగారం అని ఆలస్యంగా తెలుసుకున్న దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పరారైన నిందితులను అరెస్టు చేసి రైల్వేకోడూరు న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఇదిలా ఉండగా సదరు బలిజవీధికి చెందిన బంగారు దుకాణ యజమాని రాఘవేంద్ర వద్దకు గతనెల 20న ఓ వ్యక్తి వచ్చి నకిలీ బంగారు బ్రాస్‌లేట్‌ను అమ్మకానికి ఇచ్చాడు. అన్ని పరిశీలించిన యజమాని రూ.2,16,000లు అతనికి ఇచ్చాడు. అనంతరం బ్రాస్‌లైట్‌ను క్షుణ్ణంగా పరిశీలించగా అది నకిలీ అని తేలింది. రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కేసును కూడా త్వరగానే ఛేదిస్తామని ఎస్ఐ తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తాపడి యువకుడు మృతి



దేవూరి శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం పోడు ప్రధాన జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాజంపేట బోయినపల్లి వద్ద ఉన్న యువకుడు దేవూరి శ్రీధర్ (21) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజంపేట నుండి తిరుపతికి బాడుగ నిమిత్తం వెళ్తుండగా మాధవరంపోడు వద్ద ఆటో బోల్తా పడడంతో శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి 108కు సమాచారం అందజేసి మృతదేహన్ని కోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని, విచారిస్తున్నామని ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీ... స్కూటరిస్టు మృతి



మృతిచెందిన వ్యక్తి

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో స్కూటరిస్టు మస్తాన్ (56) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం మదనపల్లె పట్టణం, టీకేపల్లె వాసి బుడ్డాన్ సాహెబ్ కుమారుడు మస్తాన్ టీకేపల్లె నుంచి స్కూటర్‌పై మనుమరాలిని స్కూల్ నుంచి ఇంటికి పిలుచుకుని వచ్చేందుకు వెళుతున్నాడు. మార్గమధ్యంలోని చంద్రాకాలనీ వద్ద అంగళ్లు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు స్కూటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మస్తాన్‌ను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తైలు ఉన్నారు.

బోరు వద్ద ఘర్షణ - రైతు తలకు గాయం



గాయపడిన రైతు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోరు వద్ద జరిగిన ఘర్షణలో రైతు తలకు గాయమైంది. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. బుధవారం ఉదయం మదనపల్లె మండలం, పెంచుపాడు గ్రామం, శివారపల్లెకు చెందిన రైతు రెడ్డెప్ప బోరు వద్ద పనులు చేసుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన గంగాధర్, అతని కుమారుడు తేజ ఘర్షణ పడ్డారు. బోరులో ఇరువురికి భాగం ఉన్నందున నీటి సరఫరా విషయమై మాట్లాడుతుండగా, తేజ రాయితో దాడి చేశాడు. తలకు గాయమై స్పృహ కోల్పోయిన రెడ్డెప్పను కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



అసాంఘిక కార్యకలాపాలు జరిగితే లైసెన్సులు రద్దు చేస్తాం

● మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి



సూచనలిస్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టమోటా మార్కెట్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే లైసెన్సులు రద్దు చేసి, టమోటా వేలం నిర్వహించకుండా ఐదేళ్లు బ్లాక్ లిస్టులో పెడతామని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం టమోటా మండీ యజమానులతో ఆయన మాట్లాడుతూ ఏ మండీలోనైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర మండీలకు ఇబ్బందులు కలిగించకుండా కేటాయించిన స్థలంలోనే వేలం నిర్వహించాలని, టమోటా లోడింగ్ వాహనాలను ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ఉన్న మార్కెట్ స్థలంలో ఉంచాలన్నారు. రైతులు టమోటాలు అన్‌లోడ్ చేసుకున్నాక క్రేట్ల కోసం వాహనాలు ఎక్కడపడితే అక్కడ పెట్టకుండా కొంత సమయం ఆర్టీసీ బస్టాండులోని ఖాళీ స్థలంలో ఉంచాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ బాలాజీ, మండీ యజమానులు కట్టా రామకృష్ణనాయుడు, గోవింద నాయుడు, బాబునాయుడు, రామకృష్ణ, సుధాకర, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా ... పది మంది కూలీలకు గాయాలు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి పదిమంది కూలీలు గాయపడిన సంఘటన కురబలకోట మండలం, ముదివేడు వద్ద జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. బుధవారం ఉదయం మదనపల్లె పట్టణం, గొల్లపల్లె, విజయనగర్ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీలు ముదివేడు సమీపంలోని కొంగోళ్లపల్లె వద్దనున్న పంట పొలాల్లో టామోటాలు కోసేందుకు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో కురబలకోట మండలం, ముదివేడు సమీపంలోని కృష్ణారెడ్డిపల్లె వద్ద ఆటోకు అడ్డుగా బైక్ రావడంతో దాన్ని తప్పించబోయి ఆటో బోల్తాపడింది. దీంతో పదిమంది కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇందులో అందరూ విజయనగర్ కాలనీకి చెందినవారే. శ్రీనివాసులు, రామసుధ, సరస్వతి, రమణమ్మ, రెడ్డమ్మ, సి.లక్ష్మీదేవి, లక్ష్మీదేవి, ఎం.శ్రీనివాసులు ఆటో డ్రైవర్‌లకు స్వల్పంగా గాయాలయ్యాయి, అయితే ఈ ప్రమాదంలో జే.శ్రీనివాసులుకు(33) కాలు విరగగా, బాలకృష్ణ భార్య రమణమ్మ (52)కు తలకు గాయమై ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి డాక్టర్లు రెఫర్ చేశారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఆటో బోల్తాతో గాయపడి చికిత్స పొందుతున్న మహిళలు


తలారివారిపల్లెకు వైద్య బృందం



రెడ్డికీర్తనను పరీక్షిస్తున్న వైద్య బృందం

ములకలచెరువు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చామకూరి శ్రీధర్ చొరవతో తలారివారిపల్లెలో వైద్య బృందం పర్యటించింది. సోంపల్లెలో మంగళవారం జరిగిన నానో యూరియా, జీవన ఎరువుల వాడకంపై రైతు అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ హాజరైన విషయం విదితమే. ఈ సందర్భంగా మండలంలోని సోంపల్లె పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన దివ్యాంగులు రమణప్ప, రెడ్డి కీర్తన తమకు వందశాతం వైకల్యం ఉందని, తమకు వచ్చే పింఛను పెంచాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై తక్షణం స్పందించిన కలెక్టర్ ఇద్దరి ఆరోగ్య పరిస్థితులను రీ అసెస్మెంట్ చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం వైద్యాధికారి లోకేశ్వర్, వైద్య సిబ్బంది మంజుల, ఇందిరమ్మ, శైలజ, ఖాదర్‌బాషా గ్రామానికి వచ్చి సదరం పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, మాజీ సర్పంచ్ యర్రగుడి సురేష్, మాజీ వైస్ సర్పంచ్ రఫీ, నేతలు షఫీ, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో ఉద్యాన విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో యూనివర్సిటీ యాజమాన్యం

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణంలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్‌లో అనంతరాజుపేట ఉద్యాన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ప్రథమ బహుమతులు పొందిన విద్యార్థులు తిరుమల గీతిక, వినయ్‌కుమార్, మాధురి, రేష్మ, ఉదయ్‌కిరణ్, ద్వితీయ బహుమతులు పొందిన విద్యార్థులు సాయివంశీ, భార్గవి, దీపిక, సుష్మిత, జమురంబీ, పూర్ణ ప్రియాంక ఉన్నారు. ప్రథమ బహుమతికి రూ.10 వేలు, ద్వితీయ బహుమతికి రూ.5 వేలు నగదు బహుమతి అందుకున్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను బుధవారం ఉద్యాన యూనివర్సిటీ యాజమాన్యం అభినందించింది.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

- 20 గొర్రెలు, ఇద్దరు కాపరులు మృతి

జమ్మలమడుగు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న వారి పాలిట ఓ లారీ మృత్యుశకంగా మారింది. బుధవారం తెల్లవారు జామున గొర్రెలమంద వెళతుండగా అతివేగంగా లారీ దూసుకురావడంతో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెలను తోలుకెళతున్న ఇద్దరు కాపారులు తీవ్ర గాయాలపాలై మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన జమ్మలమడుగు పట్టణ శివార్లలోని శ్రీసాయి శివానీ కల్యాణ మండపం సమీపాన బైపాస్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాల్లోకి వెళితే...

నంద్యాల జిల్లా రుద్రవరం మండలానికి చెందిన గొర్రెల కాపారులు నెల రోజుల క్రితం గండికోట పరిసర ప్రాంతాల్లో గొర్రెలను మేపుకునేందుకు వచ్చారు. బుధవారం తెల్లవారుజామున తిరిగి వారి గ్రామాలకు వెళ్లేందుకు బయలుదేరారు. గొర్రెలను తోలుకుని జమ్మలమడుగు బైపాస్‌రోడ్డు గుండా వెళుతుండగా.. అదే సమయంలో తాడిపత్రి వైపు నుంచి అతివేగంతో వచ్చిన లారీ గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. దీంతో 20 గొర్రెలు సంఘటనా స్థలంలో నుజ్జునుజ్జయి మృతి చెందాయి. గొర్రెలను తోలుకుని వెళుతున్న కాపరులు రుద్రవరం మండలం నల్లవాగుపల్లెకు చెందిన వరద చిన్నవెంకటేశ్వర్లు (45) రెండు కాళ్లు విరిగి తలకు గాయాలయ్యాయి. అలాగే ఆలమూరు గ్రామానికి చెందిన రాజుపాళెం లక్ష్మీనరసింహ (35) తీవ్రంగా గాయపడ్డాడు. వీరిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో వెంకటేశ్వర్లు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మీనరసింహ మృతిచెందారు. గొర్రెల కాపరుల యజమాని వెనుక ఉండడం వలన ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ ఘటన జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఈ విషయం బంధువులు, కుటుంబ సభ్యులకు తెలియడంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకుని బోరున విలపించారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీ ఆపకుండా వెళ్లిపో వడంతో పోలీసులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా గొర్రెల మాంసపు ముక్కలు



గొర్రెల కాపరుల మృతదేహాలు

మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు

- ఐసీడీఎస్ పీడీ రమాదేవి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం పలు ప్రత్యేక చట్టాలు అమలవుతున్నాయని జిల్లా మహిళా శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి రమాదేవి అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీ ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మిషన్ శక్తి స్కీం కింద మహిళా సాధికారత-సంకల్ప్ అనే కార్యక్రమం పదిరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు జిల్లాలోని సీడీపీవోలు, సూపర్ వైజర్లకు దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా మిషన్ వాత్సల్య పథకం ద్వారా పిల్లలు దత్తత కావాల్సిన వారు చట్టబద్ధంగా తీసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు, పోక్సో చట్టం, గృహహింస విభాగం, ఫ్రీ మారిటల్ కౌన్సెలింగ్ సెంటర్ గురించి తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవోలు సునీత, శ్రీలత, శ్రీదేవి, డీసీపీవో డీవీఎస్, మిషన్ వాత్సల్య, సఖి వన్‌స్టాప్ సెంటరు సిబ్బంది పాల్గన్నారు.

యూరియా ఎక్కువైతే పంటకు హానికరం



రైతులతో మాట్లాడుతున్న జేడీ చంద్రనాయక్

చాపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటలకు యూరియాను ఎక్కువగా వాడటం హానికరమని జిల్లా వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్ అన్నారు. అల్లాడుపల్లె, కేతవరం గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ రైతులకు అవసరం ఉన్నంత మోతాదులో యూరియాను సరఫరా చేస్తామని.. ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. మండలంలో ఇప్పటి వరకు 850 మెట్రిక్ టన్నులు యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక ఎకరాకు పైరు దిగుబడి వచ్చే వరకు 70 కేజీల యూరియా మాత్రమే ఉపయోగించాలన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియాను ఉపయోంచాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటను పండిస్తే ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించవచ్చని తెలిపారు. మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో పద్మలత, వీఏఏలు విమత్, శివలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు వైద్యసిబ్బందికి సూచించారు. చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్యంపై రీప్రొడెక్టివ్ చైల్డ్ హెల్త్ 2.0 కార్యక్రమం గురించి వివరించారు. గర్భిణీల నమోదు, జననపూర్వ సంరక్షణ, సేవలపై అవగాహన కల్పించారు. సుఖప్రవసాలు, ప్రసవానంతర సేవల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వైద్యాధికారులు రాఘవేంద్ర, అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి మానస, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న స్కూలు బస్సు
- స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థులు



సంఘటనాస్థలి వద్ద ప్రైవేటు స్కూలు వ్యాను

వల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తప్పెట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద బుధవారం సాయంత్రం ప్రైవేటు స్కూలు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు విద్యార్థులు సురక్షితంగా బయట పడారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా... మండల పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకుని వల్లూరు వైపు వస్తుండగా తప్పెట్ల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే పొలం పనులు చేసుకుం టున్న ప్రజలు వచ్చి బస్సు అద్దం పగలగొట్టి పిల్లలను సురక్షి తంగా బయటకు తెచ్చారు. దీంతో విద్యార్థులు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. డివైడరు లేకపోతే పెను ప్రమాదం సంభవించేదని అంటున్నారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

విషజ్వరాల నుంచి మా బిడ్డలను కాపాడండి

- డీఎంహెచ్‌వో ఎదుట కోడిగాండ్లపల్లె ప్రజల ఆవేదన



డీఎంహెచ్‌వో వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు

ముద్దనూరు సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విషజ్వరాల నుంచి మా బిడ్డలను కాపాడాలంటూ డీఎంహెచ్‌వో నాగరాజు ఎదుట కోడిగాండ్లపల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధి కోడిగాండ్లపల్లెలో విషజ్వరాల బారిన పడ్డ చిన్నారులను బుధవారం డీఎంహెచ్‌వో విచారించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 15 సంవత్సరాల లోపు చిన్నారులకు మాత్రమే విషజ్వరాలు వచ్చి రక్త కణాలు తగ్గిపోతున్నాయన్నారు. తీవ్ర జ్వరంతో గ్రామంలో ఓ చిన్నారి మృతి చెందిందన్నారు. అనంతపురం, తాడిపత్రి, కర్నూలు, ప్రొద్దుటూరులోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయిస్తున్నామని, లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కొందరు కర్నూలు, అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. గతంలో గండికోట ప్రాజెక్టుకు బ్యాక్‌వాటర్ వచ్చినప్పుడు ఇదే పరిస్థితి ఉండేదని...సాయంత్రం 4గంటల నుంచి దోమలు వస్తున్నాయన్నారు. దీంతో జ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌వో గ్రామంలోని ఇళ్ల వద్దకు వెళ్లి నీటి నిల్వ ఉన్న డ్రమ్ములు, బానలను పరిశీలించారు. ఫ్రిజ్‌లను కూడా తనిఖీ చేశారు. నీరు నిల్వ ఉన్న డ్రమ్ములు, బానల్లో లార్వా ఉందని గుర్తించారు. నీటిని తొలగించి కొద్ది సేపు ఆరబెట్టాలని సూచించారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆర్ఎంపీల వద్దకు వెళ్ల వద్దని, వారి అనాలోచిత వైద్యం ప్రమాదకరమని సూచించారు. కాగా, కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, డాక్టర్ కరీష్మా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్ వాటర్‌తో సమస్య లేదు

బ్యాక్ వాటర్‌కు విషజ్వరాలకు ఎటువంటి సంబందంలేదని డీఎంహెచ్‌వో నాగరాజు తెలిపారు. కేవలం ఇళ్లలో నీటి నిల్వ చేసిన డ్రమ్ముల్లో లార్వా చేరడం వల్ల జ్వరాలు వస్తున్నాయి. దోమల బారి నుంచి కాపాడునేందుకు రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలన్నారు.

పొలతల హుండీ ఆదాయం రూ.29,79,565



కానుకలను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

పెండ్లిమర్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వర స్వామి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం స్వామి సన్నిధిలో సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. మల్లేశ్వరస్వామి హుండీ ద్వారా రూ.10,212,439, అక్కదేవతల హుండీ ద్వారా రూ.18,35,392, బండెన్నస్వామి హుండీ ద్వారా రూ.73,508, పుట్ట ఆంజనేయస్వామి హుండీ ద్వారా రూ.47,114, అన్నదానం ద్వారా రూ.1112 ఆదాయ వచ్చిందని ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. మొత్తం నాలుగు నెలల కాలానికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకల ద్వారా వచ్చిన ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ, బ్యాంక్ సిబ్బంది, పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

బద్వేలులో పట్టపగలు చోరీ

రూ.10లక్షలు విలువచేసే బంగారు నగలు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో వరుస దొంగతనాలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. పట్టపగలే ఇళ్లలోకి చొరబడి దొరికినంత దోచుకొని వెళుతున్నారు. ఏ ఇంటికి అయితే తాళం వేసి ఉంటుందో నిఘాపెట్టి చోరీలకు పాల్పడుతున్నారు. బుధవారం పట్టణంలోని మైదుకూరురోడ్డులో కరెంట్ ఆఫీస్ పక్కన వెంకటయ్యనగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు ఇంట్లో దొంగలు చొరబడ్డారు. శ్రీనివాసులు ఉదయాన్నే పని నిమిత్తం ఊరికివెళ్లగా, అతని భార్య సునీత మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి పక్కవీధిలో ఉన్న తన అమ్మగారి ఇంటికి వెళ్లింది. ఒకటిన్నర గంటల సమయంలో అటుగా వెళుతున్న బంధువులు ఇంట్లో తలుపులు తెరిచి ఉండటం గమనించి సునీతకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూడగా ఇంటితాళం పగులకొట్టి బీరువాలోని రెండు బంగారు నెక్లస్‌లు, ఒక జత బుట్టకమ్మలు, రెండు చైన్లు, నాలుగు ఉంగరాలు, సుమారు 12తులాలు విలువచేసే బంగారు నగలు చోరీ చేసినట్లు పోలీసులకు సమాచారం అందించారు. బద్వేలు అర్బన్‌సీఐ లింగప్ప తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. అనంతరం క్లూస్‌టీంను పిలిపించి చోరీకి గురైన ఇంటిలో తనిఖీలు చేసి, వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ మోటార్ల వైరు చోరీకి యత్నం

- దొంగలను పట్టుకున్న రైతులు
- పోలీసులకు అప్పగింత



పట్టుబడిన దొంగలు

బి.కోడూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభలవీడు గ్రామ పంచాయతీ నరసన్నకొట్టాల గ్రామ సమీ పంలో విద్యుత్ మోటర్ల వద్ద కేబుల్‌వైరు చోరీకి పాల్పడుతున్న దొంగలను రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గాజులపల్లె సుబ్బారెడ్డి, బ్రహ్మారెడ్డి, గాజులపల్లె వెంకట సుబ్బారెడ్డి అనే రైతులు తమ చేలకు నీళ్లు కట్టేందుకు వెళ్లారు. అప్ప టికే దొంగలు కొందరి మోటర్లు కేబుల్ వైరు చోరీ చేశారు. ఈ విషయం మిగతా రైతులకు సమాచారం అందించారు. బ్రహ్మారెడ్డి మోటరు వద్ద కేబుల్‌వైర్లు కత్తిరిస్తుంగా రైతులు వెంబ డించి ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. రైతులు దొంగలను గట్టిగా నిలదీయ డంతో బద్వేలు పట్టణంలో 20 మంది గ్రూపు గా ఉన్నామని.. బద్వేలు పరిసర ప్రాంతాల్లో విడివిడిగా వెళ్లి దొంగతనాలు చేస్తుంటామని తెలిపారు. ఈ సమాచారం రైతులు బి.కోడూరు పోలీసులకు అందించడంతో దొంగలను బద్వేలు సర్కిల్ ఆఫీసుకు తీసుకెళ్లారు.

రెండు బైకులు ఢీ...ఒకరికి గాయాలు

చక్రాయపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేటలో బుధవారం ముందు వెళ్తున్న బైకును వెనుక నుంచి వచ్చిన మరోబైకు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చక్రా యపేట నుంచి గంగిరెడ్డి అనే వ్యక్తి గంగిరెడ్డిపల్లెకు వెళ్తుం డగా వెనుకవైపు రాయచోటి నుంచి వస్తున్న ఓ బైకు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గంగిరెడ్డి అదుపు తప్పి కింద పడటంతో కాళ్ళు, చేతులు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంట నే వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కడపరిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవతలపై అసభ్యకర వ్యాఖ్యలు.. వ్యక్తిపై కేసు నమోదు

పులివెందుల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవతలపై అసభ్యకర పోస్టులు, అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సోషల్ మీడియాలో హిందూ దేవతలపై ఉస్మాన్ అనే వ్యక్తి అసభ్యకరంగా పోస్టులు పెట్టారన్నారు. ఈ ఘటనపై హిందూ ఐక్యవేదిక సభ్యులు ఎందుకిలా అసభ్యకర పోస్టులు పెట్టావని ప్రశ్నించినందుకు వారిపై దాడికి దిగారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

చాపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్రవాడ గ్రామానికి చెందిన కదిరేపల్లె విష్ణువర్ధన్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నయోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 7న ఆదివారం విష్ణువర్ధన్ ఓ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈమేరకు బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో అతనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డాక్టర్ నాసరమ్మకు గోల్డ్‌మెడల్



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా గోల్డ్‌మెడల్ సాధించిన డాక్టర్ చిన్ననాసరమ్మ

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లెకు చెందిన వెలుగోటి చిన్న నాసరమ్మ డాక్టర్ ఎన్టీఆర్ హెల్ యూనివర్సిటీ నుంచి గోల్డ్‌మెడల్ సాధించారు. బ్యాచిలర్ ఆఫ్ న్యాచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్ (బీఎన్‌వైఎస్)లో రాష్ట్రంలో అత్యధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టర్ చిన్న నాసరమ్మ గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ చిన్ననాసరమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రకృతి సిద్ధమైన మార్గాలతో ఆరోగ్యవంతమైన జీవనం గడపాలన్నదే తన లక్ష్యమని వివరించారు.

ఘర్షణ కేసులో ముగ్గురిపై కేసు

పులివెందుల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎస్ఆర్ ట్రావెల్స్ వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి ఏఎస్ఆర్ ట్రావెల్స్ వద్ద బస్సుకు ముందు ఉన్న కారు అడ్డుగా ఉందని పక్కకు తీయాలని ట్రావెల్స్ వారు వాహనదారుని కోరారన్నారు. దీంతో ఆ వాహనదారుడు రెచ్చిపోయి ట్రావెల్స్ వారిపై ఘర్షణకు దిగారు. ఈ మేరకు బాలగంగిరెడ్డి మరో ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు విస్తరణ ఎప్పుడో...!

- ఎదురు చూస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

చెన్నూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు చేపడతారా అని స్థానికులు ఎదురు చూపులు చూస్తున్నారు. దాదాపు పదినెలల క్రితం విస్తరణ పనుల కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు మండల సర్వే సిబ్బంది సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు. ఆ తర్వాత అధికారులు సమావేశాలు పెట్టడం, తేదీలు చెప్పడం తప్ప ఆక్రమణల తొలగింపు లేదు. విస్తరణ పనులు ముందుకు సాగిందీ లేదు. దీంతో నిత్యం ఈ రహదారి గుండా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెన్నూరు మేజరు గ్రామ పంచాయతీలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి దాదాపు 500 మీటర్లు ఉంటుంది. 2024 డిసెంబరులో అప్పటి సర్వేయరు సోమశేఖర్ సర్వే చేసి ఆక్రమణలు తొలగించేందుకు మార్కింగ్ ఇచ్చారు. ఏడాది గడుస్తున్నా ఆక్రమణలు తొలగించిన దాఖలాలు లేవు. ఇటీవల కడప ఆర్డీవో సమావేశం ఏర్పాటు చేసి సెప్టెంబరు 9న ఆక్రమణలు తొలగిస్తాం అని చెప్పి వెళ్లారు. గడువు దాటినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో చెన్నూరు-కొండపేట మీదుగా బస్సులు రాకపోకలు సాగించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు స్పందించి ఈ ఆక్రమణలు తొలగించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



చెన్నూరులో రోడ్డు విస్తరణకు నోచుకోని ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



ఎన్జీవో సంఘం అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న రాయచోటి ఎన్జీవో నేతలు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి కడప జిల్లా ఎన్నికల్లో రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు బీ. శ్రీనివాసులు, కార్యదర్శి నిత్యపూజయ్య, కోశాధికారి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులను బుధవారం రాయచోటి ఎన్జీవో సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఎన్జీవో సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి కోశాదికారి దేవేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్‌యాదవ్ తదితర నేతలు ఉన్నారు.

వృత్తి విద్యతో జీవనోపాధి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యతో జీనోపాధి పొందవచ్చునని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కే. పార్థసారధి తెలిపారు. బుధవారం ఓబువారిపల్లె కేబీజీవీ విద్యార్థినులకు టైలరింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులపై అవగాహన ఉంటే జీవనోపాధికి ఢోకా ఉండదని తెలిపారు. యూనిఫాం, బ్లేజర్ కటింగ్ కూడా నేర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల బయాలజీ అధ్యాపకురాలు లక్ష్మీప్రసన్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా రఫీ

పుల్లంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా రఫీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీలో యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శి రమణమూర్తి, సీనియర్ నాయకులు సాంబశివరావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా మాధవ మూర్తి, గౌరవాధ్యక్షుడుగా వరదరెడ్డి ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఉదయగిరి యల్లమ్మ గుడి సమీపంలో ఆటో ఢీకొనడంతో ఓ యువ కుడు మృతి చెందాడు బలిజిపల్లెకు చెందిన దొంతల నాగేంద్ర(28) తన బైకులో వెళుతుండగా బోయినపల్లి నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన నాగేంద్రను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు మన్నూరు పోలీసులు తెలిపారు.

ఐషర్ వాహనం బోల్తా..

రాజంపేట(సిద్దవటం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాకరాపేట చర్చి వద్ద బుధవారం అతివేగం కారణంగా ఐషర్ వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. రహదారికి అడ్డంగా ఉన్న వాహనాన్ని తొలగిస్తున్నామని తెలిపారు.

వీధుల్లో మురుగు.. గుండెల్లో బెరుకు!

- మురికి కూపంగా మారిన రైల్వే కోడూరు పట్టణం
- అంటువ్యాధుల భయంతో ప్రజలు విలవిల

రైల్వేకోడూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధులన్నీ దాదాపు మురుగు కూపాలుగా మారినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఆయా ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని ప్రజలు ఆరోపిస్తుండగా, ఎన్నిసార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజలు తమ ఇళ్లలోని నీటిని రోడ్లపైకి వదులుతున్నారని ఆరోగ్య సిబ్బంది ఆరోపిస్తున్నారు.

రైల్వేకోడూరు మేజర్ పంచాయతీని బృందావనం కాలనీకి వెళ్లే రోడ్డు, రంగనాయకులపేట, వసంతనగర్, ఉంగరాలనగర్, ధర్మాపురం, ఆర్‌టీసీ బస్టాండుకు వెళ్లేదారి, రైల్వేస్టేషన్ రోడ్డు, రైల్వే గేటుకు వెళ్లే ప్రాంతం, ఆంజనేయస్వామి గుడివీధి, అంకమ్మనగర్, దొమ్మరిళ్లు, చింతనగర్, నరసరాంపురం తదితర ప్రాంతాల్లోని సిమెంట్ రోడ్లు పైకి ప్రజలు మురుగు నీటిని వదులుతుండడంతోపాటు, వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా మారడంతోపాటు, దోమలు పెరిగిపోతున్నాయి. రంగనాయకులపేట, అంకమ్మనగర్ తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు పూడికతో నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. వెంకయ్యస్వామి ఆలయం సమీపంలోని డంపింగ్ యార్డు నుంచి వచ్చే దోమల కారణంగా కంటినిండా కునుకు కరువైందని గురప్పపాళెం గిరిజన కాలనీవాసులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా చిన్న పిల్లలకు ఒంటి నిండా దద్దుర్లు వస్తున్నాయని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానదారిలో ఉన్న మురుగు కాలువ కూడా వ్యర్థాలతో నిండి దుర్వాసన వెలువరిస్తోం ది. రెడ్డివారిపల్లె వెళ్లే మార్గంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తచెదారం పడేయడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా నిర్వహిస్తున్న



పేరుకుపోయిన చెత్త



నరసరాంపేటలో ఇళ్లవద్ద నిలిచిన మురుగునీరు

స్వచ్ఛాంధ్ర- తూతూ మంత్రంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదో ఒక చోట ఫొటోలకు ఫోజులిచ్చి పరిశుభ్రం చేశామని చెప్పి అధికారులు వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ వారు అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి



మురుగు పేరుకుపోయిన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లిస్తున్నాం. చెత్తచెదారం వెంటనే తొలగిస్తున్నాం. కార్మికులు తక్కువగా ఉన్నా షిఫ్ట ప్రకారం పని చేయిస్తున్నాం. ఎక్కడపడితే అక్కడచెత్తవేయ కుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మురుగు నీటిని రోడ్ల పైకి వదలవద్దని చెబుతున్నాం. వినకుంటే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుంటామని హెచ్చరిస్తున్నాం. ప్రజల్లో చైతన్యం రావాల్సి ఉంది.

- శివశంకర్‌రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అవగాహన కల్పిస్తున్నాం



అంటు వ్యాధులు వస్తే ప్రభుత్వ ఆస్పత్రికి రావాలని సూచిస్తున్నాం. రక్తకణాలు తగ్గినప్పుడు ఆస్పత్రికి వస్తే పరీక్షించి, ఇతర ప్రాంతాల్లో ఉన్న పెద్ద ఆస్పత్రికి రెఫర్ చేస్తాం. రోజూ సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి జాగ్రత్తలు చెప్పి ప్రజల్లోకి పంపిస్తున్నాం. జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్నాయని తమ దృష్టికి వస్తే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయిస్తున్నాం.

- బాలకృష్ణంరాజు, ఆరోగ్య పర్యవేక్షణాధికారి

యూరియాపై తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు

పెనగలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యూరియాపై తప్పుడు ప్రచారాలు చేస్తే కఠినచర్యలు తప్పవని పెనగలూరు తహసీల్దారు అమరేశ్వరి ఎంపీడీవో విజయరావు హెచ్చరించారు. బుధవారం నారాయణ నెల్లూరులో వారు రైతులతో మాట్లాడారు. పత్రికల్లో గాని, సోషల్ మీడియాలో గాని తప్పుడు ప్రచారాలు, కథనాలు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతుసేవా కేంద్రాల్లో యూరియా కొనుగోలు చేసి, బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకునే వారిపై కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏవో సుబ్రమణ్యం మాట్లాడుతూ ఒక రైతుకు హెక్టారుకు ఒక బస్తా మాత్రమే యూరియా ఇస్తున్నామన్నారు. అంతకంటే ఎక్కువ కావాల్సివస్తే ఎంత భూమి ఉన్నా అదనంగా ఒక బస్తా మాత్రమే ఇస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు అమరేశ్వరి

చెత్త సేకరణ పనుల తనిఖీ

నందలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, ఇంటింటి వద్ద చెత్తసేకరణ పనులను రాజంపేట డివిజనల్ పంచాయతీ అధికారి మస్తాన్‌వలి, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సునీల్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో శానిటేషన్ సిబ్బంది, క్లాప్ మిత్రలకు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం నందలూరు బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన సూపర్‌సిక్స్ సూపర్ హిట్ హోర్డింగును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె, నందలూరు పంచాయతీ కార్యదర్శులు సురేష్‌కుమార్, శ్రీనివాసులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ సూపర్ హిట్ హోర్డింగ్‌ను ప్రారంభించిన డీఎల్పీవో

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పాతబస్టాండులో ఆటో సంఘం నేతలతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ విధానాలతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 16న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతిని, కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు 25 వేలు ఆర్థిక సాయం అందించడంతో పాటు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆటో కార్మికుడి కష్టాలను ప్రభుత్వా నికి తెలిసేలా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, రమణ, వెంకటప్రసాద్, మనోహర్, గణేష్, చందు, మణి, వెంకటాద్రి, హరి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా సంఘం డైరెక్టర్‌కు సన్మానం

రాజంపేట (సిద్దవటం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం-1 గ్రామంలో బుధవారం రాత్రి మహబూబ్ నగర్, ఎస్‌కేఆర్ నగర్, ఎస్సీ కాలనీ వాసులు రాష్ట్ర నూర్‌బాషా, దూదే కుల కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడును ఘనంగా సత్క రించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ డైరెక్టర్ వీరభద్రుడు మాట్లాడుతూ పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి, ప్రజా సమస్య ల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రదోషకాల పూజ



నందలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైల్వేకేంద్రంలోని రైల్వే ఇనిస్టిట్యూట్ పక్కనే వెలసిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా వినాయకస్వామి వారికి అలంకరణ, ప్రదోషకాల పూజలను ఆలయ అర్చకుడు సరసా రవి కుమార్ స్వామి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డిజిటల్ టూల్స్‌తో నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి

రాజంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంబీఏ విద్యార్థులు డిజిటల్ టూల్స్ ద్వారా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సీనియర్ మేనేజర్ ఏవీ రాజేష్ సూచించారు స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నావిగేట్ యువర్ ఎంబీఏ కెరీర్ లేటెస్ట్ టూల్స్, ట్రెండ్స్ అండ్ స్ట్రాటజీస్ ఫర్ ల్యాండింగ్ ద రైట్ రోల్ అనే అంశంపై ఉపన్యసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు తమ కెరీర్‌ను ఎలా మలచుకోవాలి, తాజా పరిశ్రమల ట్రెండ్‌లు అవసరమైన నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవసరమైన వ్యూహాలపై సూచనలు, సలహాలు అందించారు. వ్యక్తిగత సామర్థ్యాలను పరిశ్రమ అవసరాలకు సరిపోల్చడంతోపాటు, డిజిటల్ టూల్స్ ద్వారా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలను వివరించారు. ఇంటర్వ్యూల కోసం పనితీరు అంచనా విధానాలు వంటి అంశాలపై విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. . ఈ సందర్భంగా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ సాయిబాబా రెడ్డి మాట్లాడుతూ అతిథి ఉపన్యాసాలు విద్యార్థుల కెరీర్‌కు మార్గదర్శనం చేస్తాయన్నారు. పరిశ్రమల్లో తాజా పరిణామాలను అర్థం చేసుకోవడానికి ఇది మంచి వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ టి.నవనీత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అతిథి ఏవీ రాజేష్

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

రాయచోటి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రాయచోటి పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర మేధావుల సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్ కుమార్ రాజు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో రూ.23.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ పనులకు గురువారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖామాత్యులు సత్యకుమార్‌యాదవ్, రాష్ట్ర రవాణా యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలియజేశారు. మధ్యాహ్నం 12 గంటలకు రాయచోటి పట్టణంలోని మాసాపేట మార్కెట్ యార్డు నూతన కమిటీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవంలో మంత్రులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

17న 'నిరుద్యోగి ఆవేదన' సదస్సు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులసమస్యలపై ఈ నెల 17న విజయవాడలో నిర్వహించనున్న నిరుద్యోగుల ఆవేదన సదస్సును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక శ్రీనివాస ఐటీఐ ఆవరణలో ఇందుకు సబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించాలని, అమరావతి ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించి అన్ని ప్రాంతాల వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రొఫెసర్, లెక్చరర్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో పాటు లైబ్రరీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను అన్ని విభాగాల్లోనూ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్లను కొనసాగించడంతోపాటు, విద్యార్హత ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో వారికి అవకాశం కల్పించాలని, పేద, నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి ఉచితంగా మెటీరియల్‌ను అందించాలనే డిమాండ్లతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 17న విజయవాడలో జరగనున్న నిరుద్యోగుల ఆవేదన సదస్సుకు జిల్లాలోని యువత, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'మానవత' ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి బృందం బుధవారం స్థానిక నలంద హైస్కూల్‌లో కంటి వైద్య శిబిరం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 24 మందిని తిరుపతికి తీసుకెళ్లి పరీక్షించి కంటి అద్దాలు ఇచ్చారని సంస్థ చైర్మన్ బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు ఉమాపతిరెడ్డి, సెక్రటరీ వీరనాగిరెడ్డి, జాయింట్ సెక్రటరీ ఓబులేసు, కన్వీనర్ శివయ్య, వీసీ అవేర్నెస్ ధనుంజయ, మానవత సభ్యులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేడు రాయచోటిలో జరగబోవు రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డుల పాలకవర్గాల ప్రమాణ స్వీకారానికి లక్కిరెడ్డిపల్లె మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని మండల టీడీపీ ఇన్‌చార్జి యనమల మదన్‌మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పలువురు మంత్రుల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ డాక్టర్ షఫీనాయక్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో లక్కిరెడ్డిపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి అప్పజెప్పినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ రామాంజనేయులు, సునీల్‌యాదవ్, గంగయ్య, కావలి ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్రామీణులకు వైద్య సేవలపై నిర్లక్ష్యం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు సేవలందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆరోపించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రమైన జ్వరాలు, వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా వైద్య సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలువురు ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్‌ఎంపీ వైద్యుల చుట్టూ తిరుగుతూ వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె మండల సీపీఐ కార్యదర్శి ఓబులేసు, సహాయ కార్యదర్శి వీరాంజనేయులు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 300 మందికి ఉద్యోగాలు



యువతికి నియామక పత్రాన్ని అందిస్తున్న భాస్కర్, నాగార్జున

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శ్రీశివ నర్సింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు 300 మందికి పైగా అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో 108 మంది ఉద్యోగాలు సాధించినట్లు ఆ కళాశాల డైరెక్టర్ భాస్కర్ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన యువతీ, యువకులను ఆయన అభినందించారు. ఈ జాబ్ మేళాలో 15 కంపెనీలకు పైగా పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి నాగార్జున, జేఈవో హెచ్ దొణప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



సన్మానం అందుకుంటున్న అధ్యాపకుడు రఘురామయ్య

వీరబల్లి, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు రఘురామయ్య రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది ఆయనను శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఆర్‌ఐవో రవికుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఆయన జాతీయ అవార్డు అందుకోవడానికి కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా,గాలివీటి వీరనాగిరెడ్డి, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, లివిన్ డయోగ్నస్టిక్ ఎండీ వివేకానందరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం..

రైల్వేకోడూరు రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు తలపల రేవతిని రాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంసి.వి. సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు సన్మానించారు. తాడేవాండ్లపల్లి పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వ్యాధుల బారి నుంచి లేగ దూడలను కాపాడుకోవాలి

● జిల్లా పశుసంవర్థక అధికారి గుణశేఖరపిళ్లై



రైతులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా పశుసంవర్థక అధికారి

పీలేరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నేటి దూడలే రేపటి పాడి ఆవులు అని, వాటిని చిన్నతనం నుంచే వ్యాధుల బారి నుంచి సంరక్షించుకోవాలని జిల్లా పశు సంవర్ధక అధికారి గుణశేఖర పిళ్లై పాడి రైతులకు పిలుపునిచ్చారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ రామిరెడ్డిగారి పల్లెలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు తల్లి దగ్గర ముర్రుపాలు పట్టినట్లే, పుట్టిన అరగంటలోపు ఆవు దగ్గర లేగ దూడకు ముర్రుపాలు తాగించాలన్నారు. తద్వారా అది నిరోధక శక్తి సాధిస్తుందన్నారు. అనంతరం దూడల పెంపకంలో పాటించాల్సిన మెళకువలు, వాడాల్సిన దాణా, నట్టల నివారణ మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రదర్శనకు హాజరైన దూడల్లో ఆరోగ్యంగా ఉన్న మూడు వాటికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీడీ మాలకొండయ్య, పశువైద్యాధికారులు ప్రదీప్, రామచంద్రారెడ్డి, మునిచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

వాల్మీకిపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. అయ్యవారిపల్లెలో బుధవారం ఆయన పర్యటించి ప్రకృతి వ్యవసాయంలో రైతులు సాగు చేసిన 365 రోజుల కూరగాయల పంటలు, 32 రకాల విత్తనాలతో వేసిన పీడీఎంఎస్, వరి, తదితర పంటల సాగును పరిశీలించారు. ఈ మోడల్ ద్వారా వచ్చిన ఆదాయం, పెట్టుబడి తదితర విషయాలపై స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ నాగప్రసాద్, మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఏపీఎంఐ జిల్లా పీడీ లక్ష్మీప్రసన్న, కేవీకే శాస్త్రవేత్తలు పీరుసాహెబ్, సోమశేఖర్, ఆత్మ బీటీఎం అమరనాథ్, పవన్, ప్రకృతి వ్యవసాయ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొడవలితో దాడి- ముగ్గురికి గాయాలు



గాయపడ్డ ప్రవీణ్

కలకడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూతగదా విషయమై కొడవలితో దాడి చేసిన ఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన ముడియంవారిపల్లి కొత్తపల్లిలో చోటు చేసుకుంది. సీఐ లక్ష్మన్న వివరాల మేరకు.. ప్రవీణ్‌తో అదే గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి దారి విషయంగా భూమి వద్ద గొడవ పడ్డట్లు తెలిపారు. పరిస్థితి సద్దుమణి గాక తిరిగి ప్రవీణ్ ఇంటి వద్దకు వెళ్లిన ప్రసాద్‌రెడ్డి, అతని అనుచరులు ప్రవీణ్‌పై కొడవలితో దాడి చేసి అడ్డువచ్చిన తండ్రి వెంకటరమణ, తల్లి సుబ్బమ్మను గాయ పరచినట్లు చెప్పారు. బాధితులను చికిత్స కోసం 108లో వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని..
సెల్ టవర్ ఎక్కిన భర్త

● విలపించిన తల్లిదండ్రులు, బంధువులు

● అత్త హామీతో టవర్ దిగిన అల్లుడు



గుమికూడిన జనంతో పాటు తల్లి పెంచలమ్మ, (ఇన్‌సెట్లో) పోలీసులకు వివరిస్తున్న కళ్యాణ్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో భర్త సెల్ టవర్ ఎక్కిన సంఘటన బుధవారం రైల్వేకోడూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని ధర్మాపురానికి చెందిన వెంబడి కళ్యాణ్ రంగనాయకులపేటకు చెందిన లత అనే వ్యక్తి ప్రేమించి పదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలం కాపురం సాఫీగానే సాగినా.. అనంతరం తరచూ కుటుంబ కలహాలతో భార్యభర్తల మధ్య గొడవలు నెలకొన్నాయని పలువురు చెబుతున్నారు. ఇదివరకే రెండుసార్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లత భర్తపై ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 12.50 గంటలకు రైల్వేకోడూరు ఎక్సైజ్ స్టేషన్ పక్కనే ఉన్న సెల్ టవర్‌ను కళ్యాణ్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపకశాఖల అధికారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు తదితరులు సెల్‌టవర్ దగ్గరకు చేరుకున్నారు. కిందకు దిగమని ఎంత చెప్పినా వినలేదు. ముందు జాగ్రత్తగా అగ్నిమాపక శాఖ అధికారి విజయకుమార్ వల తెప్పించి సిద్ధం చేశారు. కాగా ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌లు ప్రత్యేక చర్యలు తీసుకుని కళ్యాణ్ అత్తను సెల్ టవర్ వద్దకు తీసుకొచ్చి భార్య లతతో మాట్లాడిస్తామని చెప్పించారు. దీంతో టవర్‌పై ఉన్న కళ్యాణ్ దిగిరావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఇతని భార్య ప్రస్తుతం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉంది. ఆమెను పిలిపించి కాపురం చేయించే విధంగా పోలీసులు, బంధువులు, కుటుంబ సభ్యులు యత్నిస్తున్నారు.



సెల్ టవర్ ఎక్కిన కళ్యాణ్

13న జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న రైల్వేకోడూరు ప్రభుత్వ హైస్కూలు మైదానంలో జిల్లా స్థాయి 51వ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు హరినాథ, పి.అరుణలు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికలు పూర్తయిన తర్వాత జిల్లా స్థాయి టీంను ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో విజయవాడలోని గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 51వ అంతర్ జిల్లాల పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపిక పోటీలకు డిసెంబరు 31, 2006 లోపు పుట్టిన వారై ఉండాలని, బాలురు బరువు 75 కిలోలు, బాలికలు 65 కిలోలు ఉండాలన్నారు. వివరాలకు సెల్ నెంబరు 9392951505, 8639020050ను సంప్రదించాలన్నారు.

నకిలీ బంగారం కేసును ఛేదించిన పోలీసులు

● ఇద్దరు అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత నెలలో రెండు వేర్వేరు చోట్ల నకిలీ బంగారం కుదవ పెట్టి కొందరు నగదుతో ఉడాయించిన విషయం తెలిసిందే. అయితే అందులో ఓ కేసును పోలీసులు ఛేదించి బుధవారం నిందితులను పట్టుకున్నారు. ఎస్ఐ వీఎల్ ప్రసాద్ రెడ్డి కథనం మేరకు... పట్టణంలోని బలిజ వీధికి చెందిన ఎలిశెట్టి వెంకటేష్ బంగారు కుదవ దుకాణం నడుపుతున్నాడు. ఈ దుకాణానికి గత నెల 20న కలికిరి నియోజకవర్గంలోని కలకడ మండలానికి చెందిన రవికుమార్, సోనియాగాంధీ అనే ఇద్దరు వచ్చి నకిలీ బంగారం (బ్రాస్‌లేట్)ను రూ.1,60,000లకు కుదవ పెట్టి డబ్బుతో ఉడాయించారు. కాగా ఇది నకిలీ బంగారం అని ఆలస్యంగా తెలుసుకున్న దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పరారైన నిందితులను అరెస్టు చేసి రైల్వేకోడూరు న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఇదిలా ఉండగా సదరు బలిజవీధికి చెందిన బంగారు దుకాణ యజమాని రాఘవేంద్ర వద్దకు గతనెల 20న ఓ వ్యక్తి వచ్చి నకిలీ బంగారు బ్రాస్‌లేట్‌ను అమ్మకానికి ఇచ్చాడు. అన్ని పరిశీలించిన యజమాని రూ.2,16,000లు అతనికి ఇచ్చాడు. అనంతరం బ్రాస్‌లైట్‌ను క్షుణ్ణంగా పరిశీలించగా అది నకిలీ అని తేలింది. రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కేసును కూడా త్వరగానే ఛేదిస్తామని ఎస్ఐ తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తాపడి యువకుడు మృతి



దేవూరి శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం పోడు ప్రధాన జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాజంపేట బోయినపల్లి వద్ద ఉన్న యువకుడు దేవూరి శ్రీధర్ (21) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజంపేట నుండి తిరుపతికి బాడుగ నిమిత్తం వెళ్తుండగా మాధవరంపోడు వద్ద ఆటో బోల్తా పడడంతో శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి 108కు సమాచారం అందజేసి మృతదేహన్ని కోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని, విచారిస్తున్నామని ఎస్ఐ లక్ష్మిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీ... స్కూటరిస్టు మృతి



మృతిచెందిన వ్యక్తి

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో స్కూటరిస్టు మస్తాన్ (56) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం మదనపల్లె పట్టణం, బీకేపల్లె వాసి బుడ్డాన్ సాహెబ్ కుమారుడు మస్తాన్ బీకేపల్లె నుంచి స్కూటర్‌పై మనుమరాలిని స్కూల్ నుంచి ఇంటికి పిలుచుకుని వచ్చేందుకు వెళుతున్నాడు. మార్గమధ్యంలోని చంద్రాకాలనీ వద్ద అంగళ్లు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు స్కూటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మస్తాన్‌ను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బోరు వద్ద ఘర్షణ - రైతు తలకు గాయం



గాయపడిన రైతు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోరు వద్ద జరిగిన ఘర్షణలో రైతు తలకు గాయమైంది. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. బుధవారం ఉదయం మదనపల్లె మండలం, పెంచుపాడు గ్రామం, శివారపల్లెకు చెందిన రైతు రెడ్డెప్ప బోరు వద్ద పనులు చేసుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన గంగాధర్, అతని కుమారుడు తేజ ఘర్షణ పడ్డారు. బోరులో ఇరువురికి భాగం ఉన్నందున నీటి సరఫరా విషయమై మాట్లాడుతుండగా, తేజ రాయితో దాడి చేశాడు. తలకు గాయమై స్పృహ కోల్పోయిన రెడ్డెప్పను కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



అసాంఘిక కార్యకలాపాలు జరిగితే లైసెన్సులు రద్దు చేస్తాం

● మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి



సూచనలిస్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టమోటా మార్కెట్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే లైసెన్సులు రద్దు చేసి, టమోటా వేలం నిర్వహించకుండా ఐదేళ్లు బ్లాక్ లిస్టులో పెడతామని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం టమోటా మండీ యజమానులతో ఆయన మాట్లాడుతూ ఏ మండీలోనైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర మండీలకు ఇబ్బందులు కలిగించకుండా కేటాయించిన స్థలంలోనే వేలం నిర్వహించాలని, టమోటా లోడింగ్ వాహనాలను ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ఉన్న మార్కెట్ స్థలంలో ఉంచాలన్నారు. రైతులు టమోటాలు అన్‌లోడ్ చేసుకున్నాక క్రేట్ల కోసం వాహనాలు ఎక్కడపడితే అక్కడ పెట్టకుండా కొంత సమయం ఆర్టీసీ బస్టాండులోని ఖాళీ స్థలంలో ఉంచాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ బాలాజీ, మండీ యజమానులు కట్టా రామకృష్ణనాయుడు, గోవిందు నాయుడు, బాబునాయుడు, రామకృష్ణ, సుధాకర, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా ... పది మంది కూలీలకు గాయాలు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి పదిమంది కూలీలు గాయపడిన సంఘటన కురబలకోట మండలం, ముదివేడు వద్ద జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. బుధవారం ఉదయం మదనపల్లె పట్టణం, గొల్లపల్లె, విజయనగర్ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీలు ముదివేడు సమీపంలోని కొంగోళ్లపల్లె వద్దనున్న పంట పొలాల్లో టామోటాలు కోసేందుకు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో కురబలకోట మండలం, ముదివేడు సమీపంలోని కృష్ణారెడ్డిపల్లె వద్ద ఆటోకు అడ్డుగా బైక్ రావడంతో దాన్ని తప్పించబోయి ఆటో బోల్తాపడింది. దీంతో పదిమంది కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇందులో అందరూ విజయనగర్ కాలనీకి చెందినవారే. శ్రీనివాసులు, రామసుధ, సరస్వతి, రమణమ్మ, రెడ్డమ్మ, సి.లక్ష్మీదేవి, లక్ష్మీదేవి, ఎం.శ్రీనివాసులు ఆటో డ్రైవర్‌లకు స్వల్పంగా గాయాలయ్యాయి, అయితే ఈ ప్రమాదంలో జే.శ్రీనివాసులుకు(33) కాలు విరగగా, బాలకృష్ణ భార్య రమణమ్మ (52)కు తలకు గాయమై ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి డాక్టర్లు రెఫర్ చేశారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఆటో బోల్తాతో గాయపడి చికిత్స పొందుతున్న మహిళలు

తలారివారిపల్లెకు వైద్య బృందం



రెడ్డికీర్తనను పరీక్షిస్తున్న వైద్య బృందం

ములకలచెరువు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చామకూరి శ్రీధర్ చొరవతో తలారివారిపల్లెలో వైద్య బృందం పర్యటించింది. సోంపల్లెలో మంగళవారం జరిగిన నానో యూరియా, జీవన ఎరువుల వాడకంపై రైతు అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ హాజరైన విషయం విదితమే. ఈ సందర్భంగా మండలంలోని సోంపల్లె పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన దివ్యాంగులు రమణప్ప, రెడ్డి కీర్తన తమకు వందశాతం వైకల్యం ఉందని, తమకు వచ్చే పింఛను పెంచాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై తక్షణం స్పందించిన కలెక్టర్ ఇద్దరి ఆరోగ్య పరిస్థితులను రీ అసెస్మెంట్ చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం వైద్యాధికారి లోకేశ్వర్, వైద్య సిబ్బంది మంజుల, ఇందిరమ్మ, శైలజ, ఖాదర్‌బాషా గ్రామానికి వచ్చి సదరం పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, మాజీ సర్పంచ్ యర్రగుడి సురేష్, మాజీ వైస్ సర్పంచ్ రఫీ, నేతలు షఫీ, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో ఉద్యాన విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో యూనివర్సిటీ యాజమాన్యం

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణంలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్‌లో అనంతరాజుపేట ఉద్యాన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ప్రథమ బహుమతులు పొందిన విద్యార్థులు తిరుమల గీతిక, వినయ్‌కుమార్, మాధురి, రేష్మ, ఉదయ్‌కిరణ్, ద్వితీయ బహుమతులు పొందిన విద్యార్థులు సాయివంశీ, భార్గవి, దీపిక, సుష్మిత, జమురంబీ, పూర్ణ ప్రియాంక ఉన్నారు. ప్రథమ బహుమతికి రూ.10 వేలు, ద్వితీయ బహుమతికి రూ.5 వేలు నగదు బహుమతి అందుకున్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను బుధవారం ఉద్యాన యూనివర్సిటీ యాజమాన్యం అభినందించింది.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

● 20 గొర్రెలు, ఇద్దరు కాపరులు మృతి

జమ్మలమడుగు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న వారి పాలిట ఓ లారీ మృత్యుశకంగా మారింది. బుధవారం తెల్లవారు జామున గొర్రెలమంద వెళతుండగా అతివేగంగా లారీ దూసుకురావడంతో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెలను తోలుకెళుతున్న ఇద్దరు కాపారులు తీవ్ర గాయాలపాలై మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన జమ్మలమడుగు పట్టణ శివార్లలోని శ్రీసాయి శివానీ కల్యాణ మండపం సమీపాన బైపాస్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాల్లోకి వెళితే...

నంద్యాల జిల్లా రుద్రవరం మండలానికి చెందిన గొర్రెల కాపారులు నెల రోజుల క్రితం గండికోట పరిసర ప్రాంతాల్లో గొర్రెలను మేపుకునేందుకు వచ్చారు. బుధవారం తెల్లవారుజామున తిరిగి వారి గ్రామాలకు వెళ్లేందుకు బయలుదేరారు. గొర్రెలను తోలుకుని జమ్మలమడుగు బైపాస్‌రోడ్డు గుండా వెళుతుండగా.. అదే సమయంలో తాడిపత్రి వైపు నుంచి అతివేగంతో వచ్చిన లారీ గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. దీంతో 20 గొర్రెలు సంఘటనా స్థలంలో నుజ్జునుజ్జయి మృతి చెందాయి. గొర్రెలను తోలుకుని వెళుతున్న కాపరులు రుద్రవరం మండలం నల్లవాగుపల్లెకు చెందిన వరద చిన్నవెంకటేశ్వర్లు (45) రెండు కాళ్లు విరిగి తలకు గాయాలయ్యాయి. అలాగే ఆలమూరు గ్రామానికి చెందిన రాజుపాళెం లక్ష్మినరసింహ (35) తీవ్రంగా గాయపడ్డాడు. వీరిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో వెంకటేశ్వర్లు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మినరసింహ మృతిచెందారు. గొర్రెల కాపరుల యజమాని వెనుక ఉండడం వలన ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ ఘటన జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబు, ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఈ విషయం బంధువులు, కుటుంబ సభ్యులకు తెలియడంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకుని బోరున విలపించారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీ ఆపకుండా వెళ్లిపో వడంతో పోలీసులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా గొర్రెల మాంసపు ముక్కలు





గొర్రెల కాపరుల మృతదేహాలు

మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు

● ఐసీడీఎస్ పీడీ రమాదేవి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం పలు ప్రత్యేక చట్టాలు అమలవుతున్నాయని జిల్లా మహిళా శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి రమాదేవి అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీ ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మిషన్ శక్తి స్కీం కింద మహిళా సాధికారత-సంకల్ప్ అనే కార్యక్రమం పదిరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు జిల్లాలోని సీడీపీవోలు, సూపర్ వైజర్లకు దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా మిషన్ వాత్సల్య పథకం ద్వారా పిల్లలు దత్తత కావాల్సిన వారు చట్టబద్ధంగా తీసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు, పోక్సో చట్టం, గృహహింస విభాగం, ప్రీ మారిటల్ కౌన్సెలింగ్ సెంటర్ గురించి తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవోలు సునీత, శ్రీలత, శ్రీదేవి, డీసీపీవో డీవీఎస్, మిషన్ వాత్సల్య, సఖి వన్‌స్టాప్ సెంటరు సిబ్బంది పాల్గన్నారు.

యూరియా ఎక్కువైతే పంటకు హానికరం



రైతులతో మాట్లాడుతున్న జేడీ చంద్రనాయక్

చాపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటలకు యూరియాను ఎక్కువగా వాడటం హానికరమని జిల్లా వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్ అన్నారు. అల్లాడుపల్లె, కేతవరం గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ రైతులకు అవసరం ఉన్నంత మోతాదులో యూరియాను సరఫరా చేస్తామని.. ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. మండలంలో ఇప్పటి వరకు 850 మెట్రిక్ టన్నులు యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక ఎకరాకు పైరు దిగుబడి వచ్చే వరకు 70 కేజీల యూరియా మాత్రమే ఉపయోగించాలన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియాను ఉపయోంచాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటను పండిస్తే ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించవచ్చని తెలిపారు. మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో పద్మలత, వీఏఏలు విమత్, శివలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

● అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న స్కూలు బస్సు

● స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థులు



సంఘటనాస్థలి వద్ద ప్రైవేటు స్కూలు వ్యాను

వల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తప్పెట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద బుధవారం సాయంత్రం ప్రైవేటు స్కూలు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు విద్యార్థులు సురక్షితంగా బయట పడారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా... మండల పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకుని వల్లూరు వైపు వస్తుండగా తప్పెట్ల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే పొలం పనులు చేసుకుం టున్న ప్రజలు వచ్చి బస్సు అద్దం పగలగొట్టి పిల్లలను సురక్షి తంగా బయటకు తెచ్చారు. దీంతో విద్యార్థులు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. డివైడరు లేకపోతే పెను ప్రమాదం సంభవించేదని అంటున్నారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

విషజ్వరాల నుంచి మా బిడ్డలను కాపాడండి

● డీఎంహెచ్‌వో ఎదుట కోడిగాండ్లపల్లె ప్రజల ఆవేదన



డీఎంహెచ్‌వో వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు

ముద్దనూరు సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విషజ్వరాల నుంచి మా బిడ్డలను కాపాడాలంటూ డీఎంహెచ్‌వో నాగరాజు ఎదుట కోడిగాండ్లపల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధి కోడిగాండ్లపల్లెలో విషజ్వరాల బారిన పడ్డ చిన్నారులను బుధవారం డీఎంహెచ్‌వో విచారించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 15 సంవత్సరాల లోపు చిన్నారులకు మాత్రమే విషజ్వరాలు వచ్చి రక్త కణాలు తగ్గిపోతున్నాయన్నారు. తీవ్ర జ్వరంతో గ్రామంలో ఓ చిన్నారి మృతి చెందిందన్నారు. అనంతపురం, తాడిపత్రి, కర్నూలు, ప్రొద్దుటూరులోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయిస్తున్నామని, లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కొందరు కర్నూలు, అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. గతంలో గండికోట ప్రాజెక్టుకు బ్యాక్‌వాటర్ వచ్చినప్పుడు ఇదే పరిస్థితి ఉండేదని...సాయంత్రం 4గంటల నుంచి దోమలు వస్తున్నాయన్నారు. దీంతో జ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌వో గ్రామంలోని ఇళ్ల వద్దకు వెళ్లి నీటి నిల్వ ఉన్న డ్రమ్ములు, బానలను పరిశీలించారు. ఫ్రిజ్‌లను కూడా తనిఖీ చేశారు. నీరు నిల్వ ఉన్న డ్రమ్ములు, బానల్లో లార్వా ఉందని గుర్తించారు. నీటిని తొలగించి కొద్ది సేపు ఆరబెట్టాలని సూచించారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆర్‌ఎంపీల వద్దకు వెళ్ల వద్దని, వారి అనాలోచిత వైద్యం ప్రమాదకరమని సూచించారు. కాగా, కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, డాక్టర్ కరీష్మా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్ వాటర్‌తో సమస్య లేదు

బ్యాక్ వాటర్‌కు విషజ్వరాలకు ఎటువంటి సంబందంలేదని డీఎంహెచ్‌వో నాగరాజు తెలిపారు. కేవలం ఇళ్లలో నీటి నిల్వ చేసిన డ్రమ్ముల్లో లార్వా చేరడం వల్ల జ్వరాలు వస్తున్నాయి. దోమల బారి నుంచి కాపాడునేందుకు రాత్రి వేళ్లల్లో దోమతెరలు వాడాలన్నారు.

పొలతల హుండీ ఆదాయం రూ.29,79,565



కానుకలను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

పెండ్లిమర్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వర స్వామి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం స్వామి సన్నిధిలో సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. మల్లేశ్వరస్వామి హుండీ ద్వారా రూ.10,212,439, అక్కదేవతల హుండీ ద్వారా రూ.18,35.392, బండెన్నస్వామి హుండీ ద్వారా రూ.73,508, పుట్ట ఆంజనేయస్వామి హుండీ ద్వారా రూ.47,114, అన్నదానం ద్వారా రూ.1112 ఆదాయ వచ్చిందని ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. మొత్తం నాలుగు నెలల కాలానికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకల ద్వారా వచ్చిన ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ, బ్యాంక్ సిబ్బంది, పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు

సీకేదిన్నె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు వైద్యసిబ్బందికి సూచించారు. చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్యంపై రీప్రొడెక్టివ్ చైల్డ్ హెల్త్ 2.0 కార్యక్రమం గురించి వివరించారు. గర్భిణీల నమోదు, జననపూర్వ సంరక్షణ, సేవలపై అవగాహన కల్పించారు. సుఖప్రవసాలు, ప్రసవానంతర సేవల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వైద్యాధికారులు రాఘవేంద్ర, అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి మానస, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులను వేధించే పద్ధతులకు స్వస్తి పలకండి

● ఆర్టీసీ ఎన్ఎంయూఏ నాయకులు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులను (కండక్టర్లు- డ్రైవర్లు, మెకానిక్స్) వేధించే పద్ధతులకు ఆయా డిపోల మేనేజర్లు స్వస్తి పలకాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, జోనల్ నాయకుడు కోడూరు సుబ్బారావు, కోరారు. బుధవారం స్థానిక ఎన్ఎంయూఏ కార్యాలయంలో ఆర్టీసీ ఎన్ఎంయూఏ రీజనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలోగల అన్ని డిపోలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పట్ల అక్రమ పనిష్మెంట్లు, రికవరీలను ఇష్టానుసారంగా చేయడం దారుణమన్నారు. సమావేశంలో జేఏసీ ఛైర్మన్ శ్రీనివాసులు,రీజినల్, జోనల్ నాయకులు ,గ్యారేజీ కార్మికులు పాల్గొన్నారు.

బద్వేలులో పట్టపగలు చోరీ

రూ.10లక్షలు విలువచేసే బంగారు నగలు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో వరుస దొంగతనాలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. పట్టపగలే ఇళ్లలోకి చొరబడి దొరికినంత దోచుకొని వెళుతున్నారు. ఏ ఇంటికి అయితే తాళం వేసి ఉంటుందో నిఘాపెట్టి చోరీలకు పాల్పడుతున్నారు. బుధవారం పట్టణంలోని మైదుకూరురోడ్డులో కరెంట్ ఆఫీస్ పక్కన వెంకటయ్యనగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు ఇంట్లో దొంగలు చొరబడ్డారు. శ్రీనివాసులు ఉదయాన్నే పని నిమిత్తం ఊరికివెళ్లగా, అతని భార్య సునీత మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి పక్కవీధిలో ఉన్న తన అమ్మగారి ఇంటికి వెళ్లింది. ఒకటిన్నర గంటల సమయంలో అటుగా వెళుతున్న బంధువులు ఇంట్లో తలుపులు తెరిచి ఉండటం గమనించి సునీతకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూడగా ఇంటితాళం పగులకొట్టి బీరువాలోని రెండు బంగారు నెక్లస్‌లు, ఒక జత బుట్టకమ్మలు, రెండు చైన్లు, నాలుగు ఉంగరాలు, సుమారు 12తులాలు విలువచేసే బంగారు నగలు చోరీ చేసినట్లు పోలీసులకు సమాచారం అందించారు. బద్వేలు అర్బన్‌సీఐ లింగప్ప తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. అనంతరం క్లూస్‌టీంను పిలిపించి చోరీకి గురైన ఇంటిలో తనిఖీలు చేసి, వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు బైకులు ఢీ...ఒకరికి గాయాలు

చక్రాయపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేటలో బుధవారం ముందు వెళ్తున్న బైకును వెనుక నుంచి వచ్చిన మరోబైకు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చక్రా యపేట నుంచి గంగిరెడ్డి అనే వ్యక్తి గంగిరెడ్డిపల్లెకు వెళ్తుం డగా వెనుకవైపు రాయచోటి నుంచి వస్తున్న ఓ బైకు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గంగిరెడ్డి అదుపు తప్పి కింద పడటంతో కాళ్లు, చేతులు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంట నే వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కడపరిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డాక్టర్ నాసరమ్మకు గోల్డ్‌మెడల్



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా గోల్డ్‌మెడల్ సాధించిన డాక్టర్ చిన్ననాసరమ్మ

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లెకు చెందిన వెలుగోటి చిన్న నాసరమ్మ డాక్టర్ ఎన్టీఆర్ హెల్ యూనివర్సిటీ నుంచి గోల్డ్‌మెడల్ సాధించారు. బ్యాచిలర్ ఆఫ్ న్యాచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్ (బీఎన్‌వైఎస్)లో రాష్ట్రంలో అత్యధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టర్ చిన్న నాసరమ్మ గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ చిన్ననాసరమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రకృతి సిద్ధమైన మార్గాలతో ఆరోగ్యవంతమైన జీవనం గడపాలన్నదే తన లక్ష్యమని వివరించారు.

దేవతలపై అసభ్యకర వ్యాఖ్యలు.. వ్యక్తిపై కేసు నమోదు

పులివెందుల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవతలపై అసభ్యకర పోస్టులు, అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సోషల్ మీడియాలో హిందూ దేవతలపై ఉస్మాన్ అనే వ్యక్తి అసభ్యకరంగా పోస్టులు పెట్టారన్నారు. ఈ ఘటనపై హిందూ ఐక్యవేదిక సభ్యులు ఎందుకిలా అసభ్యకర పోస్టులు పెట్టావని ప్రశ్నించినందుకు వారిపై దాడికి దిగారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘర్షణ కేసులో ముగ్గురిపై కేసు

పులివెందుల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎస్ఆర్ ట్రావెల్స్ వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి ఏఎస్ఆర్ ట్రావెల్స్ వద్ద బస్సుకు ముందు ఉన్న కారు అడ్డుగా ఉందని పక్కకు తీయాలని ట్రావెల్స్ వారు వాహనదారుని కోరారన్నారు. దీంతో ఆ వాహనదారుడు రెచ్చిపోయి ట్రావెల్స్ వారిపై ఘర్షణకు దిగారు. ఈ మేరకు బాలగంగిరెడ్డి మరో ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

చాపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్రవాడ గ్రామానికి చెందిన కదిరేపల్లె విష్ణువర్ధన్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నయోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 7న ఆదివారం విష్ణువర్ధన్ ఓ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈమేరకు బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో అతనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రుణాలను వెంటనే మంజూరు చేయాలి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు పీఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు కె.శంకర్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు రవీంద్రనాథరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకింగ్ సబ్సిడీ రుణాలను వెంటనే విడుదల చేయాలని, ఈ రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 10న నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దీంతో జిల్లాలోని అర్హులైన వారు సుమారు 6వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కానీ ఆ తరువాత ప్రక్రియ కొనసాగించకుండా ఆపివేశారన్నారు. చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే అర్హుల జాబితా విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లాకన్వీనరు ఓరుగంటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల వైరు చోరీకి యత్నం

● దొంగలను పట్టుకున్న రైతులు ● పోలీసులకు అప్పగింత



పట్టుబడిన దొంగలు

బి.కోడూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభలవీడు గ్రామ పంచాయతీ నరసన్నకొట్టాల గ్రామ సమీ పంలో విద్యుత్ మోటర్ల వద్ద కేబుల్‌వైరు చోరీకి పాల్పడుతున్న దొంగలను రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గాజులపల్లె సుబ్బారెడ్డి, బ్రహ్మారెడ్డి, గాజులపల్లె వెంకట సుబ్బారెడ్డి అనే రైతులు తమ చేలకు నీళ్లు కట్టేందుకు వెళ్లారు. అప్ప టికే దొంగలు కొందరి మోటర్లు కేబుల్ వైరు చోరీ చేశారు. ఈ విషయం మిగతా రైతులకు సమాచారం అందించారు. బ్రహ్మా రెడ్డి మోటరు వద్ద కేబుల్‌వైర్లు కత్తిరిస్తుంగా రైతులు వెంబ డించి ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. రైతులు దొంగలను గట్టిగా నిలదీయడంతో బద్వేలు పట్టణంలో 20 మంది గ్రూపు గా ఉన్నామని.. బద్వేలు పరిసర ప్రాంతాల్లో విడివిడిగా వెళ్లి దొంగతనాలు చేస్తుంటామని తెలిపారు. ఈ సమాచారం రైతులు బి.కోడూరు పోలీసులకు అందించడంతో దొంగలను బద్వేలు సర్కిల్ ఆఫీసుకు తీసుకెళ్లారు.

రోడ్డు విస్తరణ ఎప్పుడో...!

● ఎదురు చూస్తున్న ప్రజలు

● పట్టించుకోని అధికారులు

చెన్నూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు చేపడతారా అని స్థానికులు ఎదురు చూపులు చూస్తున్నారు. దాదాపు పదినెలల క్రితం విస్తరణ పనుల కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు మండల సర్వే సిబ్బంది సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు. ఆ తర్వాత అధికారులు సమావేశాలు పెట్టడం, తేదీలు చెప్పడం తప్ప ఆక్రమణల తొలగింపు లేదు. విస్తరణ పనులు ముందుకు సాగిందీ లేదు. దీంతో నిత్యం ఈ రహదారి గుండా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెన్నూరు మేజరు గ్రామ పంచాయతీలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి దాదాపు 500 మీటర్లు ఉంటుంది. 2024 డిసెంబరులో అప్పటి సర్వేయరు సోమశేఖర్ సర్వే చేసి ఆక్రమణలు తొలగించేందుకు మార్కింగ్ ఇచ్చారు. ఏడాది గడుస్తున్నా ఆక్రమణలు తొలగించిన దాఖలాలు లేవు. ఇటీవల కడప ఆర్డీవో సమావేశం ఏర్పాటు చేసి సెప్టెంబరు 9న ఆక్రమణలు తొలగిస్తాం అని చెప్పి వెళ్లారు. గడువు దాటినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో చెన్నూరు-కొండపేట మీదుగా బస్సులు రాకపోకలు సాగించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు స్పందించి ఈ ఆక్రమణలు తొలగించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



చెన్నూరులో రోడ్డు విస్తరణకు నోచుకోని ఆర్‌అండ్‌బీ రోడ్డు



మార్కెట్ యార్డు సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్డుపై పేరుకుపోయిన మట్టి - బస్టాండు సర్కిల్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా...

జాతీయ రహదారేనా...!

● రోడ్డుకు ఇరువైపులా భారీగా పేరుకుపోయిన మట్టి

● తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు

ములకలచెరువు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అంటే రోడ్డుకు ఇరువైపులా కంటికి ఇంపుగా కనిపించాలి. ఇందుకు గాను నేషనల్ హైవే అథార్టీ ఆఫ్ ఇండియా ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తుంది. కనీసం పట్టణం గుండా వెళ్లే రహదారైనా చక్కగా ఉంచాల్సిన బాధ్యత మనది. ఈ రోడ్డు మనది కాదని ఆర్అండ్‌బీ, పట్టణ పాలక కమిటీ బాధ్యత మరిచింది. జాతీయ రహదారి అధికారులు గాలికి వదిలేయడంతో జాతీయ రహదారికి ఇరువైపులా మట్టి పేరుకు పోయి ఉంది. అంతే కాకుండా రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం, తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేయడం పరిపాటైంది. ముంబై - చెన్నై జాతీయ రహదారికి ఇరువైపులా భారీగా మట్టి పేరుకుపోయింది. అసలు ఇది జాతీయ రహదారేనా అనే అనుమానం కలుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మార్కెట్ యార్డు నుంచి మట్టి కొట్టుకొచ్చి రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయింది. స్థానిక పెట్రోల్ బంకు నుంచి ఆర్టీసీ బస్టాండు, మార్కెట్ యార్డు, బస్టాండు సర్కిల్ నుంచి షాదీమహల్ వరకు సుమారు రెండు కిలో మీటర్లకుపైగా రోడ్డు ఇరువైపులా మట్టితో నిండిపోయింది. రోడ్డే కన్పించకుండా పోయింది. వాహనాల రాకపోకలు సాగించే సమయంలో మట్టి భారీగా లేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులు వెళ్లలేకపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా భారీగా నిల్వ ఉన్న మట్టిని తొలగించాలని వాహనదారులు, స్థానికులు అధికారులను కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

నానో యూరియాపై అవగాహన పెంచుకోవాలి ● అధిక యూరియా వినియోగంతో అనర్థాలే

● రైతులకు జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ శివనారాయణ

గుర్రంకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు పంటలకు సేంద్రియ ఎరువులు వాడేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ పేర్కొన్నారు. తరిగొండలో యూరియా వాడకంపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. పంటలకు సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలన్నారు. ఇందుకు పచ్చిరొట్ట ఎరువులు, జనుము, జీలుగ వాడాలన్నారు. వరి నాటే ముందు కానుగ, వేప ఆకులు వేసి కలియదున్ని పంట సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. అధిక మోతాదులో యూరియా వాడకంతో భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గుతుందన్నారు. మండల రైతులకు యూరియా అందజేస్తున్నట్లు చెప్పారు. ఏడీఏ నాగ ప్రసాద్, ఏఓ రత్నమ్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియాను వాడాలి

పీలేరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియాను ఉపయోగించుకోవాలని కేవీపల్లె తహసీల్దారు నరేంద్ర సూచించారు. మహల్‌రాజుపల్లె, తిమ్మాపురం రైతు సేవా కేంద్రాల్లో నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఎకరాకు అర లీటరు నానో యూరియా మాత్రమే స్ప్రే చేయాలని, దాని ధర కేవలం రూ.220లు మాత్రమేనన్నారు. ఎకరాకు అర లీటరు డీఏపీ స్ప్రే చేసుకోవచ్చని, రూ.250లు మాత్రమేనన్నారు. వ్యవసాయ అధికారి మాధవి, ఏఈఓ అనిత, తిమ్మాపురం సర్పంచ్ రెడ్డప్ప పాల్గొన్నారు.

అధిక యూరియా వినియోగంతో అనర్థాలే

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటసాగులో రైతులు ఎక్కువ శాతం యూరియా వినియోగించడం వలన అనర్థాలు ఎక్కువని వ్యవసాయశాఖ ఏఓ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. చీకిలబైలు, వేంపల్లె, అంకిశెట్టిపల్లె రైతు సేవా కేంద్రాల్లో తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ తాజ్ మస్రూర్‌తో కలిసి ఆర్గానిక్ ఎరువుల వాడకంతో కలిగే ఉపయోగాలు వివరించారు. ఎక్కువ మోతాదులో యూరియా వాడితే భూసారం తగ్గుతుందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి జంగాల రమణ, జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈగలతో జనజీవనం అస్తవ్యస్తం



తహసీల్దార్ తపస్వినికి వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లి సమీపంలోని కోళ్ల ఫారాల నుంచి వచ్చే ఈగలు, వాసనతో జీవించలేక పోతున్నామని గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ తపస్వినికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ దాదాపు 15ఏళ్ల కిందట గ్రామ సమీపంలో కోళ్ల ఫారాలు వెలిశాయని అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు కోళ్ల వ్యర్థాలు, ఈగలు, వాసనలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. చనిపోయిన కోళ్లను గ్రామ సమీపంలో వేయడంతో కుక్కలు తెచ్చి గ్రామంలో వేస్తున్నాయని తెలిపారు. కోళ్ల వ్యర్థాలపై వాలిన ఈగలు తాగునీటిలో కలుషితమై జ్వరాల భారిన పడుతున్నామని వర్షాకాలం వస్తే కోళ్ల వ్యర్థాలు నీటి ధాటికి గ్రామంలోకి వస్తున్నాయని తెలిపారు. కోళ్ల ఫారాల ఈగలతో గ్రామాన్ని వదిలిపోయే పరిస్థితి నెలకొంది. స్థానికంగా వున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో ఈగలు పడుతూ పిల్లలు తినేసమయంలో కూడా ఈగలు వాలుతుండంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు పలు మార్లు సంబంధిత అధికారులకు తమ బాధను విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. తమ గ్రామంలో వున్న కోళ్ల ఫారాల లైసెన్స్‌ను రద్దు చేసి తమ గ్రామాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో స్వాతి, భూదేవి, ధనరాజ్, భారతమ్మ, సరోజ, జ్యోతి, భవాని, దేవి నారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి



రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్‌ను సన్మానిస్తున్న బెస్త సాధికార కమిటీ నేతలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు ముంబై దుర్గా కోరారు. బుధవారం దేవతానగర్‌కు విచ్చేసిన రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్‌ను బెస్త సంఘం నేతలు కలిసి సన్మానించి, పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. బెస్త కులస్థులను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని, మత్స్యకారుల సొసైటీ ద్వారా తీసుకోవాల్సిన చర్యలపై విన్నవించారు. వర్షాకాలం తరువాత నిండే చెరువులను బెస్త కులస్థులకే తొలి ప్రాధాన్యతగా కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మురళి, రమణమూర్తి, మల్లికార్జున, రమేష్, చలపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా కొరత రానివ్వం

వాల్మీకిపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు, కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని వాల్మీకిపురం మండల ప్రత్యేకాధికారి లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. బుధవారం ఆర్బీకే కేంద్రాల వద్ద యూరియా పంపిణీలో ఆమె మాట్లాడుతూ మండలం మొత్తానికి ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 180 టన్నులు యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. మండలంలో పంటలు సాగు చేసిన ప్రతిరైతుకు యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు అందజేస్తున్నామన్నారు. కూరపర్తి, విఠలం గ్రామాలకు పది టన్నుల చొప్పున యూరియా వచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీమోహన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జడ్పీహైస్కూల్‌లో క్రీడలు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న క్రీడా మైదానంలో 15,16వ తేదీల్లో రెండు స్కూల్ గేమ్స్, ఫెడరేషన్ పోటీలను నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమనారి, మండల కోఆర్డినేటర్ ఎం. జవహర్ తెలిపారు. ఈ క్రీడా పోటీలకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. అండర్ 14, 17 క్యాటగిరీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలను నిర్వహించనున్నారు. మండల స్థాయి విజేతలను నియోజకవర్గ స్థాయి, తరువాత జిల్లా స్థాయికి ఎంపికవుతారన్నారు. ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ క్రీడాపోటీల్లో పాల్గొనాలన్నారు.

ఎరువులు అడిగితే కేసులు పెడతారా?



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేతలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతుల పంటల కోసం ఎరువులు అడిగితే కేసులుపెడతారా అని సీపీఐ నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో మీడియాతో జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, కార్యవర్గ సభ్యులు సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ రైతుల పంటలకు ఎరువులు అందుబాటులో లేవని, సకాలంలో రైతులకు ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పోలీసుల సమక్షంలో నిరసన చేపడితే వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో సీపీఐ నేతలు ఆరుగురిపై కేసులు నమోదు చేసి నోటీసులు అందజేశారన్నారు. సీపీఐ నేతలపై కేసులు నమోదు చేసినంత మాత్రాన సమస్య పరిష్కారం అవుతుందని అనుకుంటే పొరపాటే అన్నారు. సీపీఐ నేతలు తిరుమల, దేవ, రెడ్డి, ముబారక్, తదితరులు పాల్గొన్నారు.

సాటుసారా స్వాధీనం - వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా నాటుసారా విక్రయిస్తున్న మోర చిన్నప్పోడును అదుపులోకి తీసుకుని అతని నుంచి 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముష్టూరు పంచాయతీ పరిధిలో చింత చెట్టు కింద నాటుసారా విక్రయిస్తున్న నిందితుడిని పట్టుకుని 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

మోడల్ స్కూల్‌లో చెస్ పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ములకలచెరువు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి చెస్, యోగా పోటీలు జరిగాయి. అండర్ -14, 17 విభాగంలో నిర్వహించిన చదరంగం, యోగా పోటీల్లో సుమారు 75 మంది హాజర య్యారు. విజేతలను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గురువారం ములకలచెరువు జడ్పీ హైస్కూ ల్‌లో వాలీబాల్, ఖోఖో, శుక్రవారం సోంపల్లె జడ్పీ హైస్కూల్‌లో కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్, 16న దేవళచెరువు జడ్పీ హైస్కూల్‌లో అథెటిక్స్ జరుగుతాయని తెలిపారు. ఎంఈఓలు వెంకటరమణ, శంకరప్ప, ప్రిన్సిపాల్ కవిత, హెచ్ఎం క్రిష్టా రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు అంజప్ప, శేషారెడ్డి, ముస్సాయిద్ హుస్సేన్, సరోజమ్మ, జోత్స్న, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు ఆర్టీసీ డీఎంగా రోషన్



పీలేరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎంగా ఎస్.ఎం.డీ. రోషన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎంగా పనిచేస్తున్న నిర్మల బదిలీపై వెళ్లడంతో గూడూరు డిపో అసిస్టెంట్ మేనేజర్ రోషన్‌ను పీలేరుకు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితో పీలేరు డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకంలో మెరుగైన వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామన్నారు. డ్రైవర్, కండెక్టర్, గ్యారేజ్ సిబ్బంది, డీఎం కార్యాలయ ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

14న క్రీడా జ్ఞాన పరీక్ష

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడా భారత్ 4వ ఆన్‌లైన్ క్రీడా జ్ఞాన పరీక్ష 2025 సెప్టెంబరు 14న ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా భారతి అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, నరేష్‌బాబు పేర్కొన్నారు. సెప్టెంబరు 12 తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పరీక్షల్లో మొదటి స్థానం సాధించిన వారికి రూ.లక్ష, ద్వితీయ స్థానంకు రూ.50 వేలు, తృతీయ స్థానం రూ.25 వేలు, నాలుగోవ స్థానం వచ్చిన వారికి రూ.11వేలు చొప్పున అందిస్తున్నట్లు కేంద్ర క్రీడా భారతి ప్రకటించిందన్నారు.

లే ఔట్ల క్రమబద్ధీకరణపై అవగాహన

వాల్మీకిపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ షణ్ముగం మాట్లాడుతూ బిల్డింగ్ అనుమతులు ఆన్‌లైన్‌లోనే ఇవ్వాలని, అక్రమ లేఔట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడం తదితర విషయాలపై పలు సూచనలు చేశారు. ఈ ఆన్‌లైన్ విధానంపై పంచాయతీ కార్యదర్శులు పూర్తి అవగాహన కలిగి విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, వాల్మీకిపురం, నిమ్మనపల్లె, గుర్రంకొండ, మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ రాజారెడ్డి, విద్యార్థులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలియని వయసు నుంచి యుక్త వయస్సు వరకు కొందరు క్షణికావేశంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆత్మహత్యలు వీడి విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌కు మంచి బాటలు వేసుకోవాలని టు టౌన్ సీఐ రాజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆత్మహత్యల నివారణ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ కొందరు చిన్నచిన్న విషయాలకే తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి మానసికంగా కుంగి పోతుంటారన్నారు. అలాంటి వారి కోసం ప్రభుత్వం ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్, పీహెచ్‌సీల్లో సైక్రియాటిస్ట్‌లను అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. సైక్రియాటిస్ట్ డాక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా మానసికంగా ఒత్తిడి ఎదుర్కొంటున్న సమయంలో టెలీమానస్ హెల్ప్ లైన్ 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేస్తే సైక్రియాటిస్ట్ అందుబాటులోకి వచ్చి వారిలో ఒత్తిడి తొలగిస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, మోటివేటర్ రామ్మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలి'



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, సెప్టెం బరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యవసాయ కూలీ లకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధ వారం ఉదయాన్నే టమో టా కోతకు మదనపల్లె నుంచి ముదివేడుకు ఆటో లో వెళుతుండగా ప్రమా దం జరిగిందన్నారు. గాయపడి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్న 10మందిని ఆయన పరామర్శించారు. జిల్లాలో కరువు పరిస్థితులతో పను లు లేక వలస వెళుతున్నారన్నారు. మూడు వందల రూపాయల కోసం మద నపల్లె వదిలి ఇతర గ్రామాలకు వెళ్లాల్సివస్తోందన్నారు. గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ. 5లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో పట్టణ నేతలు నాగరాజ, రెడ్డెప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడిగా మధు



మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మధు స్టుడియో అధినేత మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీఎస్ఐ ఫంక్షన్ హాల్‌లో మదనపల్లె ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశంలో ఎంపిక జరిగింది. గతంలో రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా పని చేసిన మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సత్తాచాటిన కలికిరి 'గురుకులం' విద్యార్థులు



వాలీబాల్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన మహల్ హైస్కూల్ బాలుర జట్టు

కలికిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో వివిధ పాఠశాలల మధ్య జరిగే క్రీడా పోటీల్లో కలికిరి గురుకులం, కలికిరి బాలికోన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. బుధవారం మహల్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. వాలీబాల్ అండర్-14, 17 బాలుర విభాగంలో మహల్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కలికిరి ఇందిరమ్మ కాలనీ హైస్కూల్ జట్టు అండర్-14, గడి ఉర్దూ హైస్కూల్ జట్టు అండర్-17లో రన్నర్‌గా నిలిచాయి. ఖోఖోలో ఇందిరమ్మ కాలనీ హైస్కూల్, మహల్ హైస్కూల్ విన్నర్స్‌గా నిలిచాయి. అండర్-17 బాలికల విభాగం వాలీబాల్ విజేతగా కలికిరి గురుకుల పాఠశాల విన్నర్‌గా, కలికిరి బాలికోన్నత పాఠశాల రన్నర్‌గా నిలిచాయి. అండర్-14 విభాగంలో విన్నర్‌గా కలికిరి బాలికోన్నత పాఠశాల, రన్నర్‌గా కలికిరి గురుకుల పాఠశాల జట్లు నిలిచాయి. కబడ్డీ పోటీల్లో అండర్-17 విభాగంలో కలికిరి గురుకుల పాఠశాల విన్నర్‌గా, కలికిరి బాలికోన్నత పాఠశాల రన్నర్‌గా నిలబడగా అండర్-14 విభాగంలో కలికిరి బాలికోన్నత పాఠశాల విజేతగా నిలిచింది. మహల్ ఉన్నత పాఠశాల రన్నర్‌గా నిలబడింది. మండల క్రీడా పోటీల కోఆర్డినేటర్ ఎస్.రియాజ్ అహ్మద్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. మహల్ హెచ్ఎం ఎ.రామ్‌ప్రసాద్, ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లాభదాయక పంటలపై దృష్టి సారించాలి

కలకడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నికర ఆదాయం పొందేందుకు రైతులు లాభాదాయక పంటల సాగుపై దృష్టి సారించాలని ఏఓ శ్రీనివాస్ అన్నారు. గంగాపురం పంచాయతీలో గ్రామస్థులకు ప్రత్యేకాధికారి దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓ భానుప్రసాద్, కదిరాయచెరువు పంచాయతీలో తహసీల్దార్ మహేశ్వరిబాయి యూరియా లభ్యత, సేంద్రియ ఎరువులు, నానో యూరియాను పంటలకు వాడవచ్చని రైతులకు సూచించారు. అనంతరం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా టమోటా పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, కార్యదర్శి దేవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న తనిఖీ అధికారి నందకుమార్‌రెడ్డి

రామసముద్రం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి కింద జరిగిన వివిధ పనులపై తనిఖీ అధికారి నందకుమార్‌రెడ్డి బుధవారం సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలోని అన్ని పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పరిధిలో జరిగిన పనులపై నివేదిక అందించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈఏడాది మార్చి వరకు జరిగిన పనులపై తనిఖీ నిర్వహించారు. వీటిలో ఉపాధి కింద రూ.6.92కోట్లు, పంచాయతీ రాజ్ కింద రూ.2.71 కోట్ల మేరకు పనులు జరిగినట్లు ఏపీఓలు మాధవి, గౌరీశంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఎస్‌టీఎం లోకేశ్వర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ వెంకయ్య, ఎంపీడీఓ గఫూర్, టీసీలు తదితరులు పాల్గొన్నారు.

మురికి కాల్వలపై అక్రమ నిర్మాణాలు



మురికి కాల్వలపై అక్రమంగా నిర్మించిన మరుగుదొడ్డి

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): విసనకర్రవాండ్లపల్లెలో మురికి కాల్వలపై అక్రమంగా నిర్మించుకున్న మరుగుదొడ్ల నిర్మాణాలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. విసనకర్రవాండ్లపల్లెలోని నందికుంట చెరువుకు ఎర్రకుంట చెరువు నుంచి కట్టుకాల్వ సప్లయ్ చానల్ ఇరిగేషన్ కాల్వను కొందరు పూడ్చి ఆ కాల్వపై మరుగు దొడ్లను కట్టుకున్నారు. దీంతో నందికుంట చెరువుకు నీరు రాకుండా జనావాసాల్లోకి వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. కొందరు యథేచ్ఛగా కాల్వను పూడ్చి నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోక పోవడంతో కాల్వను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి సర్వే చేపట్టి కాల్వలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు చేపట్టి కాల్వ పనులు చేపడితే చెరువుకు నీరు చేరతాయని గ్రామస్తులు కోరుతున్నారు.

యోగా పోటీల్లో ఎస్పీవీబీ విద్యార్థుల ప్రతిభ

ములకలచెరువు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్‌లో జరిగిన యోగా పోటీల్లో ఎస్పీవీబీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరెస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అండర్ -14 బాలికల విభాగంలో విద్యార్థి రేష్మ మెదటి స్థానం, బాలుర విభాగంలో ప్రవీణ్ మూడో స్థానంలో నిలిచారన్నారు. అండర్ - 17 విభాగంలో హేమంత్ మొదటి స్థానం, మనోజ్ మూడో స్థానంలో నిలిచారని తెలిపారు. ప్రతిభ చూపి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

టీబీని దాచకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిని దాచకూడదని, నివారించాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకుడు ప్రభాకర్ అన్నారు. బుధవారం స్థానిక చైతన్య జూనియర్ కళాశాల, వివేకానంద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి గళ్ల పరీక్షలో పాజిటివ్ వచ్చిన వారికి ఆరు నెలలు ఉచితంగా వైద్యం అందిస్తామ న్నారు. చికిత్స సమయంలో రోగి ఖాతాలో వెయ్యి రూపాయాలు చెల్లిస్తూ పౌష్టికాహారం అందిచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, హెచ్ఎం, ఉపాధ్యాయ బృదం, టీబీ యూనిట్ సిబ్బంది శాంతి, సుశీల, వనజ, తరుణ్, ఎఎన్ఎం సరిత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు మెరుగైన సదుపాయాలు

కలికిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వం మెరుగైన సదుపాయాలు కల్పిస్తోందని సూపర్‌వైజర్ అరుంధతి తెలిపారు. గుట్టపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పిల్లలందరికీ ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. రాష్ట్ర సాక్షరత మిషన్ ఆధ్వర్యంలో ఈ స్కూల్ బ్యాగులు సమకూర్చారు. కార్యక్రమంలో రాష్ట్రీయ గ్రామీణ సాక్షరత మిషన్ ప్రతినిధి రామచంద్రయ్య, జి.పద్మనాభయ్య, ఎస్.పద్మ నాభయ్య, సి.రెడ్డెప్ప, హరినాథ్, సర్పంచ్ వెంకటరెడ్డి, గ్రామస్తులు ఎస్.నాగభూషణం, అమరనాథ్, హెచ్ఎం ఎల్లారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త నూర్జహాన్, హెల్పర్ సరిత, పంచాయతీ కార్యదర్శి తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.